ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
ఆదివారం 17 ఆగస్టు 2025


నరసరావుపేటలోని ఇస్కాన్ టెంపుల్లో ఉట్టికొడుతున్న చిన్నారులు

- ఉచిత ప్రయాణంపై హర్షం
- ఉచితంతో మహిళలకు ఆర్థిక భరోసా
- జిల్లాలో తొలిరోజు 5,293 జీరో టిక్కెట్ల జారీ
- పథకం అమలుపై నారీమణులు నీరాజనాలు
- ఆర్టీసీ బస్టాండ్లు, బస్సుల్లో మహిళల కోలాహలం


నరసరావుపేట - గుంటూరు బస్సులో ప్రయాణిస్తున్న మహిళలు


నరసరావుపేట నుంచి మాచర్ల వెళ్లే బస్సు ఎక్కుతున్న మహిళలు

స్త్రీశక్తికి.. సలాం

ఆర్థిక భరోసా కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన స్త్రీశక్తి పథకానికి మహిళల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల ప్రచారంలో కూటమి నేతలు హామీ ఇచ్చినట్లుగా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కోసం మహిళలు ఎదురు చూస్తున్న క్రమంలో స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా శుక్రవారం నుంచి పథకం అమలుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పనులకు వెళ్లే వారు.. గ్రామాల నుంచి పట్టణాలకు వెళ్లే చిరు వ్యాపారులు.. చిరు ఉద్యోగులు.. దుకాణాల్లో పనులకు వెళ్లే వారికి ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంతో ఆర్థికంగా అండగా మారుతోంది. ప్రభుత్వ పథకాలెన్నో మహిళల పేరుతోనే ప్రకటించిన ముఖ్యమంత్రి చంద్రబాబు.. మహిళల కోసంగా ప్రత్యేకంగా స్త్రీ శక్తికి శ్రీకారం చుట్టడంపై మహిళా లోకంతో పాటు వివిధ వర్గాలు నీరాజనాలు పలుకుతున్నాయి. శుక్రవారం సాయంత్రం ఉచిత ప్రయాణానికి ప్రభుత్వం రైట్ చెప్పడంతో ఆర్టీసీ బస్టాండ్లలో, బస్సుల్లో మహిళల సందడి నెలకొంది. ఆధార్ గుర్తింపు కార్డుతో మహిళలు బస్సులు ఎక్కుతుండగా వారికి ఆర్టీసీ కండక్టర్లు జీరో టిక్కెట్ జారీ చేస్తున్నారు. దీంతో జిల్లావ్యాప్తంగా ఆయా డిపోల నుంచి మహిళలు పెద్దసంఖ్యలో బస్సుల్లో గమ్య స్థానాలకు చేరుతున్నారు. స్త్రీ శక్తి పథకాన్ని మహిళలు తమకు ప్రభుత్వం ఇచ్చిన వరంలా భావిస్తున్నారు.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

మహిళలు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూసిన ఆర్టీసీలో ఉచిత ప్రయాణం అందుబాటులోకి వచ్చింది. మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం ప్రారంభంతో శుభకార్యాలకు, సొంతూళ్లకు వెళ్లే వారు ఆనందోత్సాహాలతో ప్రయాణం చేస్తున్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్త్రీశక్తి పథకానికి నారీమణులు నీరాజనాలు పలుకుతున్నారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంపై మహిళలు సంబరాలు చేసుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీల్లో మహిళలకు కీలకమైన ఉచిత ప్రయాణం అమలుతో వారు శభాష్ చంద్రన్న అంటూ పాలకులపై ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం పథకాన్ని ప్రారంభించగా శనివారం సెలవు రోజు కావడంతో ఆర్టీసీ బస్సులు మహిళలతో కిటకిటలాడాయి. ఈ పథకానికి మహిళల నుంచి ఊహించనంతగా స్పందన కనిపిస్తోంది. సాధారణంగా బస్సుల్లో ప్రయాణించే మహిళల సంఖ్య ఈ పథకంతో పెరుగుతుందని (మిగతా 6లో)

3 జిల్లాలు.. 882 బస్సులు

గుంటూరు జిల్లాలోని ఐదు డిపోల్లో మొత్తం 403 బస్సులు ఉండగా అందులో 302 మహిళలు ఉచితంగా ప్రయాణించే సర్వీసులు ఉన్నాయి. ఇందులో 241 పల్లెవెలుగు బస్సులుండగా, 53 ఎక్స్‌ప్రెస్ సర్వీసులు ఉన్నాయి. ఇక బాపట్ల జిల్లాలో 260 బస్సులకు 220 సర్వీసుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించినట్లు అధికారులు తెలిపారు. పల్నాడు జిల్లాలో 439 బస్సులు ఉండగా స్త్రీ శక్తికి అర్హత కలిగిన బస్సులు 360 అందుబాటులో ఉంచినట్లు అధికారులు తెలిపారు.

- గుంటూరు జిల్లాలో శుక్రవారం పథకాన్ని ప్రారం భించిన తొలి రోజు 4800 మంది మహిళలు ఉచిత ప్రయాణం ద్వారా వారి గమ్యస్థానాలకు చేరుకున్నా రని ఆర్టీసీ అధికారులు తెలిపారు.
- పల్నాడు జిల్లాలో శుక్రవారం పథకాన్ని ప్రారంభించిన తొలి మూడు గంటల్లోనే 5,293 మంది అతివలు ఉచిత ప్రయాణం ద్వారా వారి గమ్యస్థానాలకు చేరుకున్నారు. మహిళలు ప్రయాణించిన టిక్కెట్ల విలువ 2,00,900 అని ఆర్టీసీ జిల్లా రవాణా అధికారి అజితకుమారి తెలిపారు.
- బాపట్ల జిల్లాలో శుక్రవారం సాయంత్రం నుంచి స్త్రీశక్తి పథకం అందుబాటులోకి రాగా 4,200 మంది మహిళలు జీరో టిక్కెట్ ద్వారా ప్రయాణం చేసినట్లు ఆర్టీసీ అధికారులు చెప్పారు. శనివారంతో కలుపుకుంటే ఈ సంఖ్య 24,000 వరకు ఉండొచ్చనే అంచనా వేశారు.

స్త్రీశక్తితో సంతోషం



సూపర్ సిక్స్‌లో చెప్పినట్లుగా చంద్రబాబు ప్రభుత్వం తమకు స్త్రీశక్తి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పించింది. ఇదే తమకు ఎంతో సంతోషం కలిగించే విషయం. నడిగడ్డ గ్రామం నుంచి ఉచితంగా విను కొండకు ప్రయాణించి వ్యక్తిగత పనులు చూసుకుని ఉచితంగా ప్రయాణించే అవకాశం దక్కింది. చంద్రబాబుకు మహిళ లందరి తరఫున కృతజ్ఞతలు.

-సుబ్బాయమ్మ, నడిగడ్డ, వినుకొండ

స్త్రీశక్తితో ఆర్థిక భరోసా



ప్రభుత్వం స్త్రీశక్తి పేరిట ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని ప్రవేశ పెట్టడంతో మహిళలకు ఆర్థిక భరోసా లభిస్తోంది. ఉచిత ప్రయాణం వల్ల అవసరమైన చోటికి పని నిమిత్తం ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా రాకపోకలతో కొంత ధనం మిగులుతుంది. ఇప్పటికే మహిళా సంక్షేమానికి కృషి చేస్తున్న ప్రభుత్వం స్త్రీ శక్తి పథకం ద్వారా చేయూత ఇస్తోంది ఉచిత ప్రయాణ అవకాశం కల్పించి నందుకు ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

-రూపావత్ రోజాబాయ్, సుగాలికాలనీ, సత్తెనపల్లి

హే కృష్ణా ముకుందా.. మురారి

జిల్లాలో అట్టహాసంగా కృష్ణాష్టమి వేడుకలు


నరసరావుపేటలోని ఇస్కాన్ టెంపుల్లో రాధాగోవిందుని విశేషాలంకారం

హే కృష్ణా ముకుందా.. మురారి.. అంటూ జిల్లావ్యాప్తంగా శనివారం కృష్ణాష్టమి వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు. విష్ణాలయాలు, కృష్ణ మందిరాలతో పాటు ఇస్కాన్ ఆలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలు, పూజలు జరిగాయి. పెద్దసంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కృష్ణ నామంతో భక్తులు పులకరించారు. స్వామి వారి దర్శనాలకు భక్తులు పోటెత్తారు. పలు ప్రాంతాల్లో వివిధ సంస్థల ఆధ్వర్యంలో కృష్ణాష్టమి-బాల గోకులం కార్యక్రమాలను ప్రత్యేకంగా నిర్వహించారు. విద్యార్థుల కోలాట బృంద నృత్య పోటీలు ఆకట్టుకున్నాయి. చిన్నారులు ప్రదర్శించిన రాధా, కృష్ణులు, గోపికల నృత్య రూపకం ఆబాల గోపాలాన్ని ఆకట్టుకుంది. వాడవాడల్లో యువకులు ఉత్సాహంగా ఉట్టి కొట్టే కార్యక్రమాలు నిర్వహించగా విద్యార్థులు, యువకులు, మహిళలు పెద్దసంఖ్యలో పోటీల్లో పాల్గొన్నారు. విద్యా సంస్థల్లో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాధా గోవిందుడు, గోపికల వేషధారణలతో చిన్నారులు అలరించారు.

- (నరసరావుపేట - ఆంధ్రజ్యోతి)

ఘనంగా గౌతు లచ్చన్న జయంతి


గౌతు లచ్చన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎస్పీ కంచి శ్రీనివాసరావు

నరసరావుపేట లీగల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): సర్దార్ గౌతు లచ్చన్న జయంతి శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా గౌతు లచ్చన్న చిత్రపటానికి ఎస్పీ కంచి శ్రీనివాసరావు పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ దేశంలో వల్లభాయ్ పటేల్ తర్వాత సర్దార్ అనే గౌరవం పొందిన ఏకైక వ్యక్తి డాక్టర్ గౌతు లచ్చన్న అన్నారు. మద్యపాన నిషేధం విషయంలో ప్రకాశం పంతులుతో విభేదించి మంత్రిగా ఉంటూ అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి ప్రభుత్వ పతనానికి లచ్చన్న కారణమయ్యారన్నారు. స్కూల్ విద్యకే పరిమితమైనా ఆచార్య గోగినేని రంగా ప్రథమ అనుచరుడిగా, తెలుగులో ఉపన్యాసకుడిగా, రాజాజీ ఉపన్యాసాల అనువాదకుడిగా లచ్చన్న ఘనత సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ మహాత్మాగాంధీరెడ్డి, ఆర్ఐలు ఎస్.కృష్ణ, యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవకు మరో అవకాశం 6

తిరుగు ప్రయాణానికి తిప్పలు
- చెన్నై మార్గంలోని రైళ్ల మళ్లింపు
- 18, 19, 20 తేదీల్లో కాజీపేట, విజయవాడ మీదుగా డైవర్షన్
- సెలవులకు వచ్చి.. తిరుగు ప్రయాణానికి అవస్థలు
8

నాగార్జున కొండలో పర్యాటకుల సందడి
- లాంచీ స్టేషన్ ఆదాయం రూ.1,78,450



20 క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల


విరిగిపోయిన పైలాన్‌పై ఉన్న ఏనుగు బొమ్మ ఊడిపోయిన గ్రానైట్

స్మృతి చిహ్నం.. శిథిలం

పైలాన్ మరమ్మతులపై మున్సిపాల్టీ నిర్లక్ష్యం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నరసరావుపేట ద్విశతాబ్ధి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన స్మృతిచిహ్నం శిథిలమవుతోంది. నరసరావుపేట చరిత్రకు చిహ్నంగా ఉండాల్సిన పైలాన్ అధ్వానంగా మారింది. ఏనుగు బొమ్మలు విరిగిపోగా పైలాన్‌కు అంటించిన గ్రానైట్ పలకాలు ఊడిపోయాయి. ద్విశతాబ్ధి ఉత్సవాలకు గుర్తుగా మున్సిపాల్టీలో 1997 జూన్ 27న ఉమ్మడి రాష్ట్ర గవర్నర్ కృష్ణకాంత్, అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆవిష్కరించిన పైలాన్ నిరాదరణకు గురైంది. అట్లూరు గ్రామం నుంచి నరసరావుపేట పట్టణంగా ఏర్పడి 200 ఏళ్లు పూర్తయిన సందర్భంగా 1997లో మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా ద్విశాబ్ధి ఉత్సవాలను నాటి మంత్రి డాక్టర్ కోడెల శివప్రసాదరావు నేతృత్వంలో నిర్వహించారు. ఆ సమయంలో నిర్మించిన పైలాన్ దుస్థితి గురించి ప్రస్తుతం మున్సిపాల్టీకి పట్ట డం లేదు. మున్సిపాల్టీలో ఉన్న పైలాన్‌ను నిత్యం అధికారులు చూస్తున్నా కనీసం మరమ్మతులు చేపట్టే ప్రయత్నం చేయకపోవడంపై ప్రజల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.


నరసరావుపేట ద్విశతాబ్ధి ఉత్సవాల పైలాన్


సమావేశంలో మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మున్సిపల్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

నరసరావుపేట టౌన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికుల దీర్ఘకాలిక సమస్యలు తక్షణమే పరిష్కరించాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు అవుతున్నా కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. 17 రోజుల సమ్మె కాలపు వేతనాలు, ఉద్యోగ విరమణ ప్రోత్సాహకం రూ.75 వేలు, దహన సంస్కారాలకు రూ.20 వేలు, పరిహారం రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షలు ఇవ్వాలన్నారు. క్లాప్ డ్రైవర్లకు రాష్ట్రం మొత్తం ఒకే వేతన విధానం అమలు చేయాలన్నారు. కోవిడ్ సమయంలో నియమించిన బదిలీ కార్మికులకు కూడా రూ.21 వేలు వేతనాలు చెల్లించాలన్నారు. పర్మినెంట్ కార్మికులకు సరెండర్ సెలవుల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. పెరిగిన ధరలను దృష్టిలో పెట్టుకుని కార్మికులకు సమాన పనికి సమానవేతనం ఇవ్వాలన్నారు. ఆయా సమస్యల పరిష్కారం కోసం ఈ నెలలో జరగనున్న అసెంబ్లీ సమావేశాల మొదటి రోజున మున్సిపల్ కేంద్రాల్లో కార్మికులు నిరసన ప్రదర్శనలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు షేక్ సిలార్‌మసూద్, జిల్లా అధ్యక్షురాలు చంద్రకళతో పాటు వెంకయ్య, వీరకుమార్, షేక్ చిన్నఅల్లాబక్షు, సోమశేఖర్, కిరణ్‌కుమార్, నరసింహారావు, వెంకటేశ్వర్లు, గూడ సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు గుర్తింపేది?

- 60 వేల సీసీఆర్ కార్డులకు 21,000 జారీ
- కౌలు రైతులకు ఉపయోగపడని రుణ ప్రణాళిక
- వ్యవసాయ పథకాలు అందక నష్టపోతున్న కౌలు రైతులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఖర్చులతో పాటు ప్రకృతి వైపరీత్యాలు సాగుదారులను దెబ్బతీస్తుండటంతో వ్యవసాయం నానాటికి కనాకష్టంగా మారుతోంది. కౌలు రైతుల పరిస్థితి మరీ దారుణంగా ఉంటోంది. ఈ పరిస్థితుల్లో కౌలు రైతులను గుర్తించి వారి సంక్షేమానికి ప్రయత్నించాల్సిన ప్రభుత్వం ప్రకటనలతో సరిపెడుతోంది. రుణాలు, సాగు ప్రయోజనాల కోసం కౌలు రైతులకు పంపిణీ చేసే సీసీఆర్ కార్డుల లక్ష్యం నామమాత్రంగా ఉంటోంది. ఈ కార్డుల పంపిణీ ఏటా ప్రహ సనంగా సాగుతోంది. జిల్లాలో ఉన్న కౌలు రైతులకు పంపిణీ చేస్తున్న కార్డులకు పొంతన ఉండటం లేదు. పంటల బీమా, రుణాలు, మద్దతు ధర, సబ్సిడీ విత్తనాలు ఇలా ప్రభుత్వం అందించే రైతు సంక్షేమ పథకాలు పొందాలంటే సీసీఆర్ కార్డులు తప్పని సరి. కార్డులు లేక వ్యవసాయానికి సంబంధించిన పథకాలు అం దక కౌలు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రస్తుతం జిల్లాలో ఖరీఫ్ సాగు పనులు ముమ్మ రంగా జరుగుతున్నాయి. కౌలు ఒప్పందాలు కుదిరిన భూముల్లో కౌలు రైతులు సాగు చేపట్టారు. అయితే కౌలు రైతులకు సీసీఆర్ కార్డుల జారీ ప్రక్రియ మందకొడిగా సాగుతు న్నది. జిల్లాలో 1.62 లక్షల మంది కౌలు రైతులు ఉండగా సీసీఆర్ కార్డుల జారీ లక్ష్యం 61 వేలుగా వ్యవసాయశాఖ నిర్ణయించింది. అందు లో ఇప్పటి కి 21 వేలు మాత్రమే కార్డులు జారీ చేసినట్లు సమాచారం. ఖరీఫ్‌లో పంట రుణాలు రూ.10,589 కోట్లు ఇవ్వాలనే లక్ష్యంతో రుణ ప్రణా ళికను లీడ్ బ్యాంకు ప్రకటించింది. ఈ పంట రుణాలలో కౌలు రౌతులకు ఇచ్చే రుణా లు 10 శాతం ఉండాలని ప్రభుత్వం నిర్దేశిం చిం ది. అయితే జిల్లాలో కౌలు రైతులకు రూ.216 కోట్లు పంట రుణాలు ఇవ్వాలని వ్యవసాయశాఖ లక్ష్యంగా నిర్ణ యించింది. అంటే మొత్తం కేటాయింపుల్లో ఇది కేవలం 2 శాతం మాత్రమే. కౌలు రైతులపై వివక్ష తకు ఇదే నిదర్శనమని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇక కార్డులు పంపిణీ చేసిన రైతులకు కూడా రుణ పంపిణీ ప్రారంభం కాలే దు. దీంతో కౌలు రైతులు సాగు వ్యయం కోసం ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తున్నది.




కోనంకిలోని ప్రభుత్వ భూములు

కొండలు మింగేశారు

● విచారణలో వెలుగులోకి భూ అక్రమాలు

పిడుగురాళ్ల, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో అప్పటి అధికార పార్టీ నేతలు కొందరు అధికారం అండచూపి కొండలను సైతం మింగేశారు. లేని భూమిని ఉన్నట్లుగా చూపి రెవెన్యూ రికార్డులను తారుమారు చేసిన వ్యవహారాలు తాజాగా వెలుగుచూస్తు న్నాయి. కలెక్టర్ ఆదేశాలతో అధికారులు రెవెన్యూ రికార్డులను పరిశీలిస్తున్నారు. ఈ క్రమంలో కొండలు, గుట్టలకు సైతం కొందరు వైసీపీ నేతలు వారి అనుచరులు యజమానులుగా ఉన్న విషయాన్ని గుర్తించారని సమాచారం. పిడుగురాళ్ల మండలం కోనంకి గ్రామంలో సర్వే నెంబరు 1-10 నుంచి 1-17, 184, 211/26, 342/2, 374/8, 387/38, 387/40, 589/14 నుంచి 31 వరకు రెవెన్యూ రికార్డుల్లో కొండలు, గుట్టలుగా ఉన్న ప్రభుత్వ భూములను రాసిచ్చేశారని గుర్తించారు. సర్వే నెంబరు 4లో ఉన్న విస్తీర్ణానికి మించి 80 సెంట్లు, సర్వే నెంబరు 8లో ఎకరం, సర్వే నెంబరు 136లో 1.20 ఎకరాలు, 199/ఏలో ఎకరం, 450/3లో 3 ఎకరాలు, 450/4లో 7.78 ఎకరాలను కొందరి పేరిట నమోదు చేశారని తేల్చారు. 43 ఎకరాలకు పైగా రెవెన్యూ రికార్డులో నమోదు చేయించు కున్నారని గుర్తించారు. విస్తీర్ణానికి మించి భూమి రికార్డు ల్లో నమోదు కావడాన్ని చూసి విచారణ అధికారులు విస్తుపోతున్నారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు ఆహ్వానం

చిలకలూరిపేట, ఆగస్టు16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్‌వీఎస్ సీవీఎస్ హైస్కూల్లో ఉన్న ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్‌లో టెన్త్, ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ ఉప్పలపాటి వెంకటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నామ మాత్రపు ఫీజుతో సార్వత్రిక విద్యాపీఠం ద్వారా (ఏపీ ఓపెన్ స్కూల్) దూర విద్యను చదువుకోవచ్చునని, రెగ్యులర్ సర్టిఫికెట్‌తో సమానమైన ఈ విద్యను వయస్సుతో నిమిత్తం లేకుండా ప్రతి ఒక్కరూ చదువుకోవచ్చునని పేర్కొన్నారు. ఈ నెల 31వ తేదీ నాటికి 14 ఏళ్ల వయస్సు నిండిన అభ్యర్థులు పదో తరగతిలో ప్రవేశానికి అర్హులని తెలిపారు. ఇతర వివరాలకు 94922 48937 నంబరుకు సంప్రదించాలని తెలిపారు.

అన్నదాత సుఖీభవకు మరో అవకాశం

గుంటూరు సిటీ, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): వివిధ కారణాల వల్ల అన్నదాత సుఖీభవ నిధులు జమ కాని వారికి ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. అర్హత ఉండి కూడా పథకం వర్తించకపోతే అర్జీలు స్వీకరించేందుకు అవకాశం కల్పించింది. గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో రైతులు తమ అర్జీలను అందించవచ్చునని జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు తెలిపారు. ఈ నెల 20 వ తేదీ వరకు అర్జీలు స్వీకరించేలా ప్రభుత్వం గ్రివెన్స్ మాడ్యూల్ అందుబాటులో ఉంచిందని వెల్లడించారు. లబ్ధి చేకూరని రైతులు రైతు సేవా కేంద్రాలను వెంటనే సంప్రదించాలని డీ ఏ ఓ తెలిపారు.

ఆసుపత్రుల్లో..

ఆహార సరఫరాకు టెండర్ల ఆహ్వానం

గుంటూరు సిటీ, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య చికిత్స నిమిత్తం వచ్చే వారికి, వైద్య సిబ్బంది కి ఆహారం సరఫరాకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్యశాలల సమన్వయాధికారి తెలిపారు. నరసరావుపేట (200పడకలు), సత్తెనపల్లి (100పడకలు), చిలకలూరిపేట(100 పడకలు), అమరావతి (30పడకలు), గురజాల (30పడకలు) ఆసుపత్రుల కోసం ఈ టెండర్ ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. అర త కలిగిన వ్యక్తులు, సంస్థలు, స్వయం సహాయక సంఘాల నుంచి నిర్ణీత నమూనాలో సీల్డ్ టెండర్లు స్వీకరించనున్నట్లు తెలిపారు. టెండర్ నమూనా ఫారం లోనే అన్ని వివరాలు ఉంటాయని, ఈ నెల 18వ నుంచి 23వ తేదీ వరకు టెండర్లు స్వీకరించడం జరుగుతుందన్నారు. ఈ నెల 23న సాయంత్రం 5 గంటలకు జాయింట్ కలెక్టర్ సమక్షంలో టెండర్లు ఖరారు చేయడం జరుగుతుందని తెలిపారు.

చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

● రూ.13 లక్షల సొత్తు రికవరీ

రొంపిచర్ల, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సంతగుడిపాడు గ్రామంలో నామాల మీన అనే మహిళ ఇంట్లో ఏప్రిల్‌లో జరిగిన చోరీ ఘటనలో నిందితుడిని రొంపిచర్ల పోలీసులు శనివారం అదుపులో తీసుకున్నారు. గ్రామానికి చెందిన గాలం రాజేష్ అరెస్ట్ చేసి, సుమారు రూ రూ.13 లక్షల మేర సొమ్మును రికవరీ చేసినట్టు ఎస్‌ఐ మణికృష్ణ తెలిపారు. గాలం రాజేష్ వైసీపీ యువజన విభాగంలో పదవిని పొందాడు. ఎస్‌ఐ మాట్లాడుతూ.. సాంకేతిక పరిజ్ఞానంతో అతన్ని అరెస్టు చేసి సొత్తును రికవరీ చేసినట్టు పేర్కొన్నారు. నిందితుడిని కోర్టుకు హాజరు పరచనున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

పరిశీలనలో..తిరుమలకు ఉచిత బస్సు ప్రయాణం

● భక్తుల మనోభావాలను దెబ్బతీసిన గత పాలకులు
● అడగకుండా వరాలిచ్చే నాయకుడు సీఎం చంద్రబాబు
● ఎమ్మెల్సీ, టీటీడీ బోర్డు మెంబరు జంగా కృష్ణమూర్తి



మాట్లాడుతున్న జంగా కృష్ణమూర్తి తదితరులు

రెంటచింతల,ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): గత పాలకులు తిరుమల కొచ్చే భక్తుల మనోభావాలను కల్తీ ఆవు నెయ్యితో దారుణంగా దెబ్బతీసి అపవిత్రం చేశారని ఎమ్మెల్సీ, టీటీడీ పాలక మండలి సభ్యుడు జంగా కృష్ణమూర్తి విమర్శించారు. కలియుగదైవమైన వేంకటేశ్వరస్వామి కళ్లు తెరవడంతో పాపాలు చేసిన వారంతా పాతాళ లోకానికి పోయారన్నారు. తిరుమల కొండపైకి మహిళా భక్తులకు ఉచితంగా బస్సు సౌకర్యం ఏర్పాటు చేసే విషయాన్ని పాలకవర్గం పరిశీలిస్తోందని ఆయన వెల్లడించారు. అడగకుండా వరాలిచ్చే నాయకుడు చంద్రబాబు అని కొనియాడారు. శనివారం కృష్ణాష్టమిని పురస్కరించుకుని రెంటచింతలలోని శ్రీకృష్ణదేవాలయాన్ని ఆయన సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ మర్యాదలతో వేద పండితులు జంగా కృష్ణమూర్తికి స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్నప్పటికి ఇచ్చిన హామికి కట్టుబడి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఏకైక సీఎం చంద్రబాబేనన్నారు. స్త్రీ శక్తి పథకంతో మహిళలు ఆనందబాష్పాలు రాలుస్తున్నారని తెలిపారు. ఆస్తి హక్కులో వాటా కల్పించి, ఆర్టీసీలో మహిళా కండక్టర్లకు 1996 అవకాశం కల్పించిందని అప్పటి సీఎం చంద్రబాబు, రవాణ మంత్రి దివంగత హరికృష్ణేనని జంగా గుర్తు చేశారు. ప్రజలందరి భాగస్వామ్యంతో సనాతన ధర్మ ప్రచార కార్యక్రమాలను విస్తృతం చేస్తున్నామన్నారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలను నభూతో నభవిష్యతి అనే రీతిలో నిర్వహించబోతున్నామన్నారు.దాదాపు పది వేల మంది భక్తులు విశ్రాంతి తీసుకునేలా పీఏసీ+5ను త్వరలో అందుబాటులోకి తెస్తున్నామని ప్రీమియం బడ్జెట్ వెయిటింగ్ హాళ్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఏకీకృత పరిపాలన భవనాన్ని నిర్మించబోతున్నట్లు ప్రకటించారు."సంక్షేమ నిధికి ఇచ్చిన రూ.6 కోట్లు మొత్తాన్ని ఉద్యోగులకు చెల్లించేందుకు బోర్డు నిర్ణయించిందన్నారు. ఆ సమావేశంలో సైదులు యాదవ్, మాజీ సర్పంచ్ సుంకయ్య, నాగరాజు, ప్రభురాజు యాదవ్, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు సుమంత్‌రెడ్డి, నీలం మల్లయ్య పాల్గొన్నారు.

20 క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల



20 క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు



ప్రకాశం బ్యారేజీ వద్ద వరద ఉధృతి

విజయపురిసౌత్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయానికి శ్రీశైలం నుంచి వరద కొనసాగుతూనే ఉంది. శనివారం శ్రీశైలం నుంచి 1,99,544 క్యూసెక్కుల వరద నీరు వస్తుండడంతో ప్రాజెక్ట్ అధికారులు 20 క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం నీటిమట్టం 587.40 అడుగులు ఉంది. ఇది 305.74 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 6006, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 29,516, 20 క్రస్ట్ గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 1,56,540 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, మొత్తం ఔట్‌ఫ్లో 1,94,462 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో శనివారం 40.44 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు ఉలిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 1,86,722 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా 16,600 క్యూసెక్కుల నీరు, లీకుల ద్వారా నాలుగు వందల క్యూసెక్కులు, ఆరు గేట్ల ద్వారా 1,79,587 క్యూసెక్కుల నీరు, మొత్తం 1,96,587 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది.

ప్రకాశం బ్యారేజి వద్ద కొనసాగుతున్న వరద ఉధృతి

తాడేపల్లి టౌన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణా నది వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టుతోపాటు ప్రధాన వాగుల నుంచి 2,46,884 క్యూసెక్కుల వరదనీరు ఇన్‌ఫ్లోగా నమోదు అయిందని ఇరిగేషన్ జేఈ రాజేష్ తెలిపారు. రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటి మట్టం కొనసాగుతుండగా మొత్తం 50 గేట్లను 6 అడుగులు, 20 గేట్లను 5 అడుగుల మేర ఎత్తి దిగువకు 2,44,250 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్టు ఇరిగేషన్ శాఖ జేఈ రాజేష్ తెలిపారు. తూర్పు డెల్టా కాల్వకు 2, 118, పశ్చిమ డెల్టాకు 516 క్యూసెక్కులు వదులుతుండగా గుంటూరు చానల్‌కు నీటి విడుదల నిలిపివేశారు. దిగువ ప్రాంతాల ప్రజలు, లంక భూముల రైతులు, మత్స్యకారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని, మత్స్యకారులు నదిలోకి వెళ్లకూడదని అధికారులు హెచ్చరించారు.

హైకోర్టును ఆశ్రయించిన సీపీఎస్ ఉద్యోగులు

గుంటూరు సిటీ, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): తమకు ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయి కోసం ఆంధ్రప్రదేశ్‌లోని సీపీఎస్ (కాంట్రీబ్యూటరీ పెన్షన్ స్కీం) ఉద్యోగులు హైకోర్టును ఆశ్రయించారు. ఆంధ్రప్రదేశ్ కాంట్రీ బ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పఠాన్ బాజీ ఈ నెల 13న పిటీషన్ దాఖలు చేశారు. 2018 జూలై నుంచి రాష్ట్రంలోని సీపీఎస్ ఉద్యోగులకు డీఏ, ఏపీజీఎల్ఐ, ఆర్జిత సెలవులు, పీఆర్ సీ బకాయి రూపేణా ప్రభుత్వం సుమారు రూ.6వేల కోట్ల వరకు చెల్లించాల్సి ఉన్నట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వం హయాంలో బకాయిలు ఇవ్వకుండా, వాళ్ల దాచుకున్న సొమ్మును కూడా దారి మళ్లించారన్న ఆరోపణలు ఉన్నాయి. సీపీఎస్ ఉద్యోగులు రావాల్సిన బకాయిల కోసం గట్టిగా అడిగిన సందర్భంలో జీఓలు విడుదల చేసి వాటిని అమలు పరచలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కొంత సొమ్మును విడుదల చేసినప్పటికీ సీపీఎస్ ఉద్యోగుల బకాయి మాత్రం జమ కాలేదు. ఈ నేపథ్యంలో వైసీపీ ప్రభుత్వం విడుదల చేసిన జీఓలు అమలు పరచేలా ఆదేశాలు ఇవ్వాలని ఉద్యోగులు కోర్టును ఆశ్రయించారు.

రైతుల అభ్యున్నతికి పాటుబడుతున్న ప్రభుత్వం

●జీడీసీఎంఎస్ ఛైర్మన్ వడ్రాణం హరిబాబునాయుడు



హరిబాబునాయుడిని సత్కరిస్తున్న అధికారులు, కూటమి శ్రేణులు

తెనాలిరూరల్, ఆగస్టు16(ఆంధ్రజ్యోతి): వ్యవసాయాన్ని దండుగ కాదు పండుగ చేస్తామన్న గత వైసీపీ ప్రభుత్వం క్రాప్ హాలిడే ప్రకటించే పరిస్థితికి అన్నదాతలను దిగజార్చిందని జీడీసీఎంఎస్ ఛైర్మన్ వడ్రాణం హరిబాబునాయుడు విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఆది నుంచి రైతులకు అవసరమైన అన్ని పనిముట్లు, సాగు సాయం అందిస్తూ అండగా నిలుస్తుందని చెప్పారు. శనివారం మండలంలోని కొలకలూరు, నందివెలుగు గ్రామాల్లో రైతులతో హరిబాబునాయుడు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలకు పంటలు దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. దెబ్బతిన్న పైర్లలో రైతాంగం తిరిగి సాగు పనులు చేపట్టేందుకు.. సన్నద్ధం కావాలన్నారు. ఆయా గ్రామాల్లోని గోడౌన్‌లను పరిశీలించారు. రైతులకు అవసరమైన ఏరువులను అందుబాటులో ఉంచామని చెప్పారు. తొలుత గ్రామానికి వచ్చిన హరిబాబు నాయుడికి కూటమి శ్రేణులు స్వాగతం పలికి దుశాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ కో ఆపరేటీవ్ ఆఫీసర్ రామారావు, బిజినెస్ మేనేజర్ శ్రీనివాస్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అదుపుతప్పి..కాల్వలోకి దూసుకెళ్లి

కర్లపాలెం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): కర్లపాలెం గణపవరం రోడ్డులో వాహనం శనివారం అదుపుతప్పింది. పాతూరు వంతెన వద్ద మహీంద్ర థార్ వాహనం ఇసుక చానల్‌లోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగ లేదు. వంతెనకు ఇరువైపులా రక్షణ గోడలు లేనందున తరుచూ ప్రమాదాలు జరుగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు.



కాల్వలో పడిన వాహనం

దొంగతనం కేసులో జైలు శిక్ష

కొల్లూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : దొంగతనం కేసులో నిందితుడికి జైలు శిక్ష విధించినట్లు ఎస్‌ఐ అమర్‌వర్ధన్ శనివారం తెలిపారు. గత జనవరి 16న మండల పరిధిలోని చిలుమూరులో కృష్ణానది ఒడ్డున ఉన్న కనకదుర్గమ్మ తల్లి, లక్ష్మీతిరుపతమ్మ తల్లి ఆలయాల్లో అమ్మవారి నగలు, హుండీలోని నగదు చోరీకి గురయ్యాయి. ఆలయ పూజారి కేశవరావు గుడి వద్దకు రాగా తాళాలు పగలగొట్టి ఉండటం గుర్తించి ఆలయ ధర్మకర్త యార్లగడ్డ సుబ్బారావుకు సమాచారం ఇచ్చారు. ఆయన చోరీ విషయంపై కొల్లూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్‌ఐ జి.ఏడుకొండలు కేసు నమోదు చేసి, చోరీకి పాల్పడిన నిందితుడు మోపిదేవి మణికంఠ అలియాస్ పొట్టిని అరెస్టు చేశారు. చోరీ చేసిన నగలను అమ్ముకోగా వచ్చిన రూ.50 వేలు నగదును స్వాధీనం చేసుకుని కోర్టుకు హాజరు పరిచారు. సీనియర్ ఏపీపీ పరిశపోగు సునీల్‌కుమార్ ప్రాసిక్యూషన్ చేయగా కోర్టు కానిస్టేబుల్ మాధవరావు సాక్షులను కోర్టులో ప్రవేశ పెట్టడంతో.. నేరం రుజువైంది. దీంతో తెనాలి ప్రిన్సిపల్ సివిల్ జడ్జి పవన్‌కుమార్ ముద్దాయికి ఏడు నెలలు జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

● ముఖ్య అతిథిగా టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు



పల్లా శ్రీనివాసరావును సత్కరిస్తున్న టీడీపీ నేతలు

తాడేపల్లి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఎవరైతే ధర్మాన్ని అనుసరిస్తారో వారు నిజంగా శ్రీకృష్ణ పరమాత్మ అనుగ్రహాన్ని పొందుతారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. శనివారం తాడేపల్లి మెయిన్ రోడ్డులోని శ్రీకృష్ణ మందిరంలో జరిగిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ తాడేపల్లి మందిరంలో దర్శనం చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ధర్మం కోసం ఆలోచించాలని, ధర్మంలో మానవత్వం న్యాయం ఉందన్నారు. అనంతరం జీయర్ ఆశ్రమ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులుతో కలిసి శ్రీనివాసరావు అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. సుమారు 6వేల మంది అన్నదానంలో పాల్గొన్నారు. తొలుత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యాదవ సంఘం అధ్యక్షుడు లాకా వెంగళరావు యాదవ్, దానబోయిన సుందరరావుయాదవ్, ఏపీ టూరిజం డిపార్టుమెంట్ ఛైర్మన్ నూకసాని బాలాజీ, అసెంబ్లీ చీఫ్ మార్షల్ గణేష్, రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, పట్టణ టీడీపీ అధ్యక్షుడు వల్లభనేని వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

విజన్ ఉంటే విజయాలు సాధ్యం

● హాస్టల్లో జర్మన్ లాంగ్వేజ్ తరగతులను ప్రారంభించిన ఎమ్మెల్యే నసీర్
● హాజరైన సాంఘిక సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి నాయక్



మాట్లాడుతున్నఎమ్మెల్యే నసీర్

గుంటూరు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): విజన్ ఉంటే విద్యార్థులు విజయాలు సాధించవచ్చని, ఎప్పటికప్పుడు కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్, సాంఘిక సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి నాయక్ అన్నారు. స్థానిక కోడిగుడ్డు సత్రంలోని ఎస్సీ ఇంటి గ్రేటెడ్ హాస్టల్లో శనివారం జర్మన్ భాషా తరగతులు ప్రారంభించారు. కార్యక్రమానికి మేయర్ కోవెలమూడి నాని, మాదిగ కార్పొరేషన్ ఛైర్మన్ ఉండవల్లి శ్రీదేవి, మాల కార్పొరేషన్ ఛైర్మన్ విజయకుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్ ప్రధానమని, సాంకేతికతను ఎప్పటికప్పుడు అందిపుచ్చుకోవాలని సూచించారు. కోడిగుడ్డు సత్రంలో ఎస్సీ ఇంటిగ్రేటెడ్ హాస్టల్లో 400 మంది విద్యార్థులకు వసతి సౌకర్యం ఉందన్నారు. జర్మన్ లాంగ్వేజ్ శిక్షణకు 42 మంది విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు. వీరిలో ఒకరిని విదేశాలకు పంపించేందుకు పీ-4 కార్యక్రమం ద్వారా తాను దత్తత తీసుకోనున్నట్లు ఎమ్మెల్యే నసీర్ వెల్లడించారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో స్కిల్ కమ్యూనికేషన్ సెంటర్లను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఎస్సీ ఇంటిగ్రేటెడ్ హాస్టల్ నిర్మాణం 2017లో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో నిధులు మంజూరు చేయడంతో పారంభమైందని తెలిపారు. గత ఐదేళ్ల కాలంలో వైసీపీ ప్రభుత్వం గాలికి వదిలేసిందని విమర్శించారు. తాను ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే ఎస్సీ ఇంటిగ్రేటెడ్ హాస్టల్ నిర్మాణానికి సంబంధించిన ఫైల్‌ను సీఎం చంద్రబాబు వద్దకు తీసుకొని వెళ్లానని తెలిపారు. రూ.1.80 కోట్ల నిధులు విడుదల చేయడంతో హాస్టల్ నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేశామని వెల్లడించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సజీల, సోషల్ వెల్ఫేర్ డైరెక్టర్ లావణ్య వేణి, డిప్యూటీ డైరెక్టర్ చెన్నయ్య, స్కిల్ కమ్యూనికేషన్ ఈడీ మనోహర్ పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.20 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	123, 132, 142
చికెన్ విత్ స్కిన్(కిలో)	230.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	240.00

స్త్రీశక్తికి.. సలాం

(5వ పేజీ తరువాయి)

ఊహించిన ప్రభుత్వం అందుకు తగినట్లుగా ఏర్పాట్లు చేసింది. దీంతో జిల్లాలో ఎక్కడా ఎటువంటి అవాంతరాలు లేకుండా మహిళల ఉచిత ప్రయాణం సాఫీగా జరిగింది. పథకాన్ని ప్రారంభించిన రెండో రోజు శనివారం ఉదయం నుంచే బస్టాండ్లలో మహిళల సందడి కనిపించింది. పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో అత్యధికంగా మహిళా ప్రయాణికులు కనిపించారు. వివాహ శుభకార్యాల కోసమని కొందరు, సెలవులతో పుట్టింటికి వెళుతున్నామని మరికొందరు, రోజువారీ పనులకు వెళ్తున్నామని ఇంకొందరు మహిళలు జీరో ఫేర్ టిక్కెట్ తీసుకుంటూ సంతోషం వ్యక్తం చేశారు. వరుసగా మూడు రోజులు సెలవులు రోజులు కావడంతో సోమవారం నుంచి బస్సుల్లో మహిళల రద్దీ పెరుగుతుందని ఆర్టీసీ అంచనా వేస్తోంది. ఇందుకు తగ్గట్టుగా ముందస్తు చర్యలు చేపట్టనుంది. ఈ పథకం అమలు చేయడం వల్ల నెలకు రూ.2,000 నుంచి 2,500 వరకు మిగిలినట్లేనని చిరు ఉద్యోగులు, వివిధ పనుల కోసం ప్రయాణాలు చేసే మహిళలు తెలిపారు. ఈ మిగుల మొత్తాలను తాము ఇతర కుటుంబ అవసరాలకు వినియోగించుకునే అవకాశం దక్కిందని ఆనందం వ్యక్తం చేశారు. అంతేకాకుండా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం వల్ల భద్రత కూడా ఎక్కువగా ఉంటుందని మహిళలు చెబుతున్నారు. స్త్రీశక్తితో ఆర్టీసీలో ప్రయాణించే మహిళల సంఖ్య 20 నుంచి 30 శాతం పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ మేరకు ఉచిత ప్రయాణానికి ఆర్టీసీ ఏర్పాట్లు చేసింది.

అంటువ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలి

● వైద్య ఆరోగ్య శాఖ జిల్లా అధికారి డాక్టర్ రవి



దొడ్లేరులో పర్యటిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ జిల్లా అధికారి డాక్టర్ రవి

క్రోసూరు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల వల్ల వరద ప్రభావిత ప్రాంతాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బీ రవి అన్నారు. శనివారం మండలంలోని దొడ్లేరు గ్రామంలో ఆయన పర్యటించారు. గ్రామంలో పర్యటించి అధికారులతో, సిబ్బందితో పరిస్థితిని సమీక్షించారు. గ్రామంలో తిరిగి స్థానికులకు తగు సూచనలు చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మురుగునీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సైడు కాలువల్లో బ్లీచింగ్ చల్లించాలని, క్లోరినేషన్ చేయించాలని, ఎబాట్ ద్రావణాన్ని చల్లించాలని సూచించారు. గ్రామంలో వైద్య శిబిరాన్ని సందర్శించారు. ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిస్థితిని సమీక్షించాలన్నారు. గ్రామంలో నిర్మాణమవుతున్న ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించి సూచనలు చేశారు. జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్, మండల ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శ్యామ్‌సన్, మలేరియా సబ్ యూనిట్ అధికారి మొగల్ సుభాన్ బేగ్, హెల్త్ ప్రొవైడర్ భూలక్ష్మి, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

పిడుగురాళ్ల, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): తుమ్మలచెరువు ప్రాథమిక పాఠశాలలో ఆదివారం కాటూరి మెడికల్ కళాశాల, హాస్పటల్ సౌజన్యంతో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు మాజీ ఎంపీపీ అల్లు సత్యవతి పిచ్చిరెడ్డి తెలిపారు. జనరల్ మెడిసిన్, గైనకాలజీ, ఇఎన్‌టి, చర్మవ్యాధులు, కార్డియాలజీ, ఆప్తమాలజీ, ఆర్థోపెడిక్, పలు వ్యాధులకు అత్యాధునిక సౌకర్యంగల బస్సులో ఉచిత పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. శిబిరానికి హాజరయ్యేవారు ఆధార్‌కార్డు, సెల్‌ఫోన్ తీసుకురావాలన్నారు.

అనుగురాజు విగ్రహకమిటీ సమావేశం

పిడుగురాళ్ల, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): కృష్ణాష్టమిని పురస్కరించుకొని స్థానిక గంగమ్మతల్లి దేవాలయం వద్ద శనివారం అనుగురాజు యాదవ్ విగ్రహ ఆవిష్కరణ నిర్వహణ కమిటీ సమావేశం జరిగింది. పిడుగురాళ్ల యాదవ సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులకు భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేసి విగ్రహ కమిటీ కరపత్రాలను జడ్పిటిసి జంగా వెంకటకోటయ్య, డిసి కమిటీ చైర్మన్ గండికోట వెంకటేశ్వర్లు, విగ్రహ ఏర్పాటు కమిటీ నియోజకవర్గ అధ్యక్షులు మేకల రాంబాబు, యాదవ సేవా సమితి అధ్యక్షులు ఆవుల జనార్ధనరావు తదితరులు ఆవిష్కరించారు. అనంతరం అన్నదానం చేశారు.

పీఏసీఎస్ అధ్యక్షుడిగా యడ్లపల్లి శివ

పిడుగురాళ్ల, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): వీరాపురం పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా గుత్తికొండకు చెందిన యడ్లపల్లి శివ, సభ్యులుగా గోలి రేశమ్మ, గుర్రం వీరారెడ్డిలను నియమిస్తూ జిల్లా కో-ఆపరేటివ్ సొసైటీ డిప్యూటీ రిజిస్ట్రార్ తిరుపతయ్య ఉత్తర్వులు జారీ చేశారు. పెదఅగ్రహారం పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా పి మరియమ్మ, సభ్యులుగా పుల్లయ్య, బ్రహ్మయ్యలను నియమించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ముప్పాళ్ళ, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ముప్పాళ్ళ జెడ్పీ హైస్కూల్‌లో 1988-1993 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక శనివారం పాఠశాలలో జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకొని నాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు కలగొట్ల బాలిరెడ్డి, అన్నపురెడ్డి కోటి లింగారెడ్డి, అన్నదాసు సురేష్, పోటు వెంకట లక్ష్మీనారాయణ, తాళ్ళ లత, సయ్యద్ అన్వనర్ పాల్గొన్నారు.

20న ఘంటసాల కళా పరిషత్ నాటక పోటీలు

సత్తెనపల్లి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వడ్డవల్లి పోలేరమ్మ గుడివద్ద ఈనెల 20వ తేదీ బుధవారం సాయంత్రం ఘంటసాల కళా పరిషత్ ఆధ్వర్యంలో నాటకోత్సవాలు జరుగుతాయని కళా పరిషత్ అధ్యక్షుడు బుడగాల సుబ్బారావు శనివారం విలేకరులకు తెలిపారు.

దాతల చేయూత అభినందనీయం

సత్తెనపల్లి రూరల్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): పాఠశాల అభివృద్ధికి, పాఠశాలలో వసతుల కల్పనకు దాతల చేయూత అభినందనీయమని ఎన్‌ఆర్‌ఐ మదమంచి రామకృష్ణ అన్నారు. మండలంలోని కట్టావారిపాలెం ప్రాథమిక పాఠశాలలో గోడలకు బొమ్మలు వేసేందుకు రూ.20వేల చెక్కును స్నేహ హస్తాలు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్‌ఆర్‌ఐ రామకృష్ణ చేతులమీదుగా హెచ్‌ఎం వడ్లమూడి శ్రీలక్ష్మికి అందజేశారు. కోయ నరసింహారావు రూ 15వేల విలువైన కుర్చీలను అందజేశారు. అనంతరం ఫౌండేషన్ ద్వారా పుస్తకాలు సమకూర్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు కోయ లక్ష్మయ్య, సుబ్బారావు, రాంబాబు, జానకిరావు, ఎంపీటీసీ దేవినేని అనురాధ పాల్గొన్నారు.

పలువురికి ఉత్తమ అధికారి అవార్డులు

గురజాలటౌన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలువురు అధికారులు ఉత్తమ అధికారి అవార్డుకు ఎంపికయ్యారు. ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సుధీర్, మండల పరిషత్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ వేముల వెంకటేశ్వర్లు, ఏఎస్‌ఐ షేక్ మస్తాన్‌వలి శుక్రవారం నరసరావుపేటలో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో మంత్రి మనోహర్ నుంచి అవార్డులు అందుకున్నారు.

బాలబాలికలకు వాటర్ బాటిళ్ల పంపిణీ

రెంటచింతల,ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): రెంటచింతల రేగుల మాణ్యంలో వున్న ఏపి ట్రైబల్ స్కూల్ బాలబాలికలకు శనివారం ఎంఎల్‌ఆర్ ఫౌండేషన్ ద్వారా వాటర్ బాటిళ్లను పంపిణీ చేసినట్లు డైరక్టర్ కళ్యాణ్ చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రమేష్, కరుణాకర్, ఎస్‌ఎంసీ చైర్మన్ చిరంజీవి పాల్గొన్నారు.

మాజీ ప్రధాని వాజ్‌పేయికి ఘన నివాళులు

దుర్గి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): దుర్గిలో శనివారం మాజీ ప్రధాని వాజ్‌పేయి వర్ధంతిని బీజేపీ నేతలు నిర్వహిచారు. వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి గంజర్ల ఆదిలక్ష్మి, బత్తుల రాణి, చిట్టెమ్మ, లక్ష్మమ్మ, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ప్రతిభకు పురస్కారం

మాచవరం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేమవరం గ్రామ పంచాయతీ సెక్రటరీ పీ ఉషారాణి ఉత్తమ ప్రతిభ పురస్కారం అందుకున్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నరసరావుపేటలో కలెక్టర్, డీపీవో చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. ఎంపీడీవో చిరంజీవి, డిప్యూటీ ఎంపీడీవో వెంగళరావు, మండలంలోని పీఎస్‌లు ఉషారాణికి అభినందనలు తెలిపారు.



డీపీవో నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న పీఎస్ ఉషారాణి

భక్తిశ్రద్ధలతో కృష్ణాష్టమి వేడుకలు



కృష్ణుడి విగ్రహానికి పూజలు చేస్తున్న జంగా కృష్ణమూర్తి, నిఖిల్, వెంకటకోటయ్య తదితరులు

పిడుగురాళ్ల, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల గంగమ్మతల్లి దేవాలయం వద్ద కృష్ణాష్టమి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి, యరపతినేని నిఖిల్, జడ్పిటిసి జంగా వెంకటకోటయ్య ఆలయంలో, కృష్ణుడు విగ్రహం వద్ద పూజలు నిర్వహించారు. అనంతరం ఉట్టికొట్టే కార్యక్రమాన్ని జంగా ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ తురకా వీరస్వామి, పాండురంగ శ్రీను, గండికోట వెంకటేశ్వర్లు, మేకల రాంబాబు, మస్తాన్, మేకల సాంబశివరావు, కొక్కెర కొండలు, పలువురు యాదవ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

● దాచేపల్లి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను శనివారం దాచేపల్లి మండలంలో ఘనంగా నిర్వహించారు. టీటీడీ బోర్డు సభ్యులు జంగా కృష్ణమూ ర్తి ఆధ్వర్యంలో ఉట్టికొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నారులను కృష్ణుని వేషాలతో అలంకరిం చి కృష్ణగీతాలను ఆలపించారు. నారాయణపురం లో కోదండరామస్వామి ఆలయంలో పొనుగుపాటి రమేష్ శర్మ, ధర్మకర్త రాం ప్రసాదు ఆధ్వర్యంలో ఉట్టికొట్టే పోటీలు నిర్వహించారు. దాచేపల్లిలోని శ్రీఅంకమ్మతల్లి దేవాలయంలో సుందరాకాండ పారాయణం నిర్వహించారు. సారంగపల్లి అగ్రహారం వేడుకల్లో తహసీల్దార్ శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు. పెదగార్లపాడు, నడికూడి, కేసానుపల్లి గ్రామాల్లో వేడుకలను ఘనంగా నిర్వహించారు.

● మాచవరం: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మాచవరం శ్రీకృష్ణ దేవాలయంలో ఉట్టికొట్టే కార్యక్రమం ఏర్పాటుచేశారు. గంగిరెడ్డిపాలెంలో టీటీడీ బోర్డు మెంబరు జంగా కృష్ణమూర్తి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మాచవరం ఎస్‌ఐ తిరుపతిరావు ఉట్టికొట్టే కార్యక్రమాన్ని ప్రారంభించారు. మోర్జంపాడు తదితర గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు.

ఉత్సాహంగా ఉట్టి కొట్టే కార్యక్రమాలు



సత్తెనపల్లి: వడ్డవల్లిలో ఉట్టి కొడుతున్న ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వడ్డవల్లి వీరాంజనేయ స్వామి గుడి వద్ద శ్రీకృష్ణ దేవాలయంలో శనివారం కృష్ణాష్టమి వేడుకలు జరిగాయి. వేడుకల్లో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉట్టి కొట్టారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు ఎలినేడి రామస్వామి, పూజల వెంకటకోటయ్య, చౌట శ్రీనివాసరావు, ఎలినేడి లక్ష్మీతులసీ, మస్తాన్‌వలి, నూర్‌బాషా జాన్‌బాబు, కే శ్రీనివాసరావు పాల్గొన్నారు.

● సత్తెనపల్లి రూరల్: శ్రీకృష్ణాష్టమి వేడుకలు మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా జరిగాయి. లక్కరాజుగార్లపాడు, పెదమక్కెన, భట్లూ రు, బృగుబండ, ధూళిపాళ్ళ గ్రా మాల్లో వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఉట్టి కొట్టే కార్యక్రమంలో యువతీ యువకులు, పెద్దలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

● రాజుపాలెం: మండలంలోని రాజుపాలెం, బలిజేపల్లి, ఉప్పలపాడు, అనుపాలెం, నెమలిపురి తదితర గ్రామాలలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉట్టికొట్టే కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. రాజుపాలెంలో కమిటీ పెద్దలు సఖినాల వలిరాజు, ఎం వెంకటప్పయ్య పాల్గొన్నారు.

● నకరికల్లు: శ్రీకృష్ణాష్టమి వేడుకలను మండలంలో ఘనంగా నిర్వహించారు. కుంకలగుంటలో వేణుగోపాలస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో బండి శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

● ముప్పాళ్ళ: మండలంలోని పలు గ్రామాల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు వైభవంగా జరిగాయి. దమ్మాలపాడులో శ్రీకృష్ణదేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. పలు గ్రామాల్లో ఉట్టికొట్టే కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వైభవంగా కృష్ణాష్టమి ఉత్సవాలు



పూజల్లో ఎమ్మెల్యే బ్రహ్మనందరెడ్డి

అమరావతి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని మండలంలోని ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక గోపాల్‌నగర్‌లోని శ్రీకృష్ణుని ఆలయంలో పూజలు నిర్వహించి స్వామివార్ల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. నరుకుళ్లపాడు, ఎండ్రాయి, లేమల్లె, కర్లపూడి, ఉంగుటూరు, మునగోడు గ్రామాలలో భక్తులు ఆలయాల్లో పూజలు నిర్వహించారు.

● క్రోసూరు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు క్రోసూరులో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా వేణుగోపాలస్వామి ఆలయం, గాంధీచౌక్, నరసింహస్వామి దేవాలయాల వద్ద ఉట్టిలను ఏర్పాటుచేసి యాదవ సంఘం సభ్యులు వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి గ్రామోత్సవం జరిగింది. మండలంలోని అనంతవరం, దొడ్లేరు, నాగవరం, బయ్యవరం, ఊటుకూరు, అందుకూరు గ్రామాల్లో ఉట్ల పండుగ ఘనంగా నిర్వహించారు.

● పెదకూరపాడు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని 75 తాళ్ళూరు కోదండ రామాలయం వద్ద శనివారం శ్రీ కృష్ణాష్టమిని పురస్కరించుకొని ఏర్పాటుచేసిన ఉట్టికొట్టే కార్యక్రమంలో అధిక సంఖ్యలో యువత పాల్గొన్నారు. కార్యక్రమంలో ఈవో సత్యనారాయణ రెడ్డి, ధర్మకర్తలు గుత్తికొండ అంజిరెడ్డి, అర్చకులు శ్రీనివాసాచార్యులు పాల్గొన్నారు. మండలంలోని పెదకూరపాడు, జలాలపురం, కంభంపాడు గ్రామాల్లో వేడుకలను నిర్వహించారు.

● బెల్లంకొండ, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మండంలోని పలు గ్రామాల్లో శనివారం కృష్ణాష్టమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. అనంతరం ఉట్టికొట్టే కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. బెల్లంకొండ యాదవబజారులో ఆలయాల వద్ద కృష్ణుని బొమ్మను ఏర్పాటుచేసి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భారీ ఊరేగింపు నిర్వహించారు. బెల్లంకొండ గాంధీ బొమ్మ సెంటర్‌లో బెల్లంకొండ గ్రూపు దేవదాయశాఖ ఈవో ఎస్ రామకోటిరెడ్డి ఆధ్వర్యంలో ఉట్టికొట్టే కార్యక్రమం ఏర్పాటుచేశారు. మాచాయపాలెం యాదవ్‌యూత్ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు.

● విజయపురిసౌత్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణాష్టమి సందర్భంగా ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి మాచర్ల మండలం కొప్పునూరు గ్రామంలోని శ్రీరుక్మిణి, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పంగులూరి పుల్లయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు నేరేటి వీరాస్వామి యాదవ్, మార్కెట్‌యార్డు చైర్మన్ రాజబోయిన మల్లీశ్వరి, పెద అంజి, వెంకన్న, వీరాంజి, సుధాకర్ రెడ్డి, జల్లెల కొండలు, వజ్రం నాయక్, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● కారంపూడి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని షిర్డీసాయి మందిరంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

● రెంటచింతల,ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణుని జన్మదిన వేడుకలు రెంటచింతలతో పాటు ఇతర గ్రామాల్లో శనివారం వేడుకగా నిర్వహించారు. శ్రీరుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామిని పురవీధుల్లో ఊరేగించారు. ఉప్పస్తంభాల సెంటర్‌తో పాటు శ్రీకృష్ణుని ఆలయం వద్ద ఉట్టికొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎండోమెంట్స్ ఈవో రామిరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

● దుర్గి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకొని దుర్గిలోని యాదవుల బజారులో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉట్టికొట్టి సంబరాలు జరుపుకున్నారు. చిన్నారుల శ్రీకృష్ణుని వేషధారణలు అలరించాయి. సాయంత్రం ఉత్సవవిగ్రహానికి ఊరేగింపు జరిపారు. కార్యక్రమంలో వై గోపాల్, నాగేశ్వరరావు, గోపాల్, రవి, జక్కా బాజిబాబు, యెల్లెబోయిన సుబ్బారావు, ఎం అంజి, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ సెలూన్స్ ఏర్పాటుకు నిరసనగా ర్యాలీ

అమరావతి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): తరతరాల నుండి క్షవరవృత్తినే నమ్ముకుని జీవిస్తున్న తమపై కార్పొరేట్ సెలూన్స్ ఏర్పాటుచేసి ఆర్థికపరిస్థితిని దెబ్బతీసేలా కొందరు ప్రయత్నిస్తున్నారని, దానికి నిరసనగా అమరావతి నాయి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శాంతియుత నిరసన ర్యాలీ జరిగింది. ర్యాలీలో బీ సూరిబాబు, టీ కోటేశ్వరరావు, శివప్రసాద్‌రావు, ఎన్ నాగమల్లేశ్వరరావు, ఎన్ సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో వీహెచ్‌పీ గోరక్షక కమిటీ ఏర్పాటు

అచ్చంపేట, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లిలో శనివారం శ్రీఅంకమ్మతల్లి దేవాలయంలో వీహెచ్‌పీ గోరక్ష కమిటీ ఏర్పాటుచేసినట్టు గోరక్షక ప్రముఖ్ తుమ్మా మర్రెడ్డి శనివారం తెలిపారు. కమిటీ సభ్యులకు గోరక్ష ప్రముఖ్ కేవీ రామాంజనేయులు వీరికి బాధ్యతలను అప్పగించారు. గోపీ, గుర్రం నాగార్జున, చిన్ని శ్రీనివాసరావు, దారెడ్ల రామిరెడ్డి సభ్యులుగా ఉన్నారు. కార్యక్రమంలో రవికుమార్, సుబ్బారాయుడు, చలపతిరావు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి టీడీపీ నేత ఆర్థికసాయం

కారంపూడి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒప్పిచర్ల గ్రామానికి చెందిన బాలమ్మ అనారోగ్య కారణాలతో శనివారం మృతిచెందింది. విషయం తెలుసుకున్న టీడీపీ నేత పంగులూరి పుల్లయ్య రూ.5వేలను మట్టిఖర్చుల నిమిత్తం మృతురాలి కుటుంబసభ్యులకు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ పుష్పలత, నాగయ్య పాల్గొన్నారు.



సీఎం, డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న టీడీపీ నాయకులు, మహిళలు

చిత్రపటాలకు క్షీరాభిషేకం

సత్తెనపల్లి రూరల్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారితకు ప్రభుత్వం కట్టుబడి ఉందనటానికి నిదర్శనం స్త్రీ శక్తి పథకమని టీడీపీ మండల నాయకులు అన్నారు. మండలంలోని కట్టమూరులో పార్టీ నాయకులు, మహిళలు సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, ఎమ్మెల్యే కన్నా చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మండడి ఖాశీ ప్రసాదు, ఎస్‌ఎంసీ చైర్మన్ మాగంటి పద్మనాభ ప్రసాదు పాల్గొన్నారు.

● మాచర్లటౌన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంపై శనివారం పట్టణంలోని వడ్డెర ఓబన్న సెంటర్లో మున్సిపల్ చైర్మన్ మదార్‌సాహెబ్, వైస్‌చైర్మన్ యర్రాకుల సిద్ధమ్మ సిద్ధయ్య యాదవ్ ఆధ్వర్యాన మహిళలు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి లోకేష్, ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నేత కె.దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన మేకల కాపరి బంధువులకు అప్పగింత

మాచర్లటౌన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): వెల్దుర్తి మండలం గంగలకుంటకు చెందిన కంపసాటి శ్రీను మేకలు మేపేందుకు మూడు రోజుల క్రితం సమీప అటవి ప్రాంతానికి వెళ్లి దారి తప్పాడు. కుటుంబసభ్యులు వెల్దుర్తి ఎస్‌ఐ సమందర్‌వలికి ఫిర్యాదు చేయడంతో డ్రోన్‌సాయంతో అటవీప్రాంతాన్ని గాలించగా శ్రీను ఆచూకీ లభించింది. ఎస్‌ఐ తన సిబ్బందితో శ్రీనును రక్షించి శనివారం కుటుంబసభ్యులకు అప్పగించారు.

ట్రాక్టర్స్ ర్యాలీని జయప్రదం చేయండి

అన్నదాత సుఖీభవ పథకాన్ని సమర్థవంతంగా అమలుచేసిన సందర్భంగా ఆదివారం పట్టణంలో నిర్వహించనున్న ట్రాక్టర్స్ ర్యాలీని జయప్రదం చేయాలని టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావు కోరారు. ప్రజాప్రతినిధులు, రైతులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పులుపునిచ్చారు.

300 మందికి అన్నప్రసాదం పంపిణీ

కారంపూడి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీవాసవీ సేవ అన్నప్రసాద కమిటి ఆధ్వర్యాన పట్టణంలో గాంధీబొమ్మ సెంటర్ శ్రీప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్ద శనివారం 300 మందికి అన్నప్రసాదం పంపిణీ చేశారు. కొల్లిపర వెంకటసుబ్బారావు, వెంకటలక్ష్మికుమారి దంపతులు, గుండా రామాంజినేయులు, లక్ష్మి దంపతులు, సయ్యద్ జానీబాషా, రజియా దంపతులు, జానీబాషా, నూరునీషా దంపతులు, వి.వెంకటేశ్వర్లు, ఎస్.జయ సహకారం అందించారు.

సేవా కార్యక్రమాల్లో రోటరీ క్లబ్



మాట్లాడుతున్న రోటరీ క్లబ్ ఆఫ్ రొటేరియన్ విజయకృష్ణ


పెదకూరపాడు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా సేవా కార్యక్రమాల్లో రోటరీ క్లబ్ ముందుందని రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు అసీవర్స్ ప్రెసిడెంట్ రొటేరియన్ కొండపనేని విజయకృష్ణ అన్నారు. పెదకూరపాడులోని ఎంపీయూపీ స్కూల్‌కు రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు ఆసీవర్స్ సౌజన్యంతో కొండపనేని నాగేశ్వరరావు జ్ఞాపకార్థం కుమారులు సాంబశివరావు, సుబ్బారావు, మౌలయ్యలు ఆర్‌వో వాటర్‌ప్లాంట్‌ను కొండపనేని శ్రీనివాసరావు, విజయకృష్ణ, మురళీకృష్ణలు ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ గుడిపూడి రాజు, టీడీపీ నాయకుడు ఏటుకూరి బ్రహ్మయ్య, అర్తిమళ్ళ రమేష్, బాష్యం ఆంజనేయులు, నండూరి సాంబశివరావు, పరస తాళ్ళూరు పీఏసీఎస్ అధ్యక్షుడు ఏటుకూరి రత్నకుమార్ పాల్గొన్నారు.

బీసీల అభ్యున్నతికి లచ్చన్న కృషి



గౌతు లచ్చన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నిఖిల్ తదితరులు

పిడుగురాళ్ల, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీల అభివృద్ధికి సర్దార్ గౌతు లచ్చన్న కృషిచేశారని యరపతినేని సాయినిఖిల్ తెలిపారు. శనివారం పిడుగురాళ్ల పార్టీ కార్యాలయం వద్ద సర్ధార్ గౌతు లచ్చన్న జయంతి సందర్భంగా లచ్చన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ తురకా వీరస్వామి, వెంకటేశ్వర్లు, రమేష్, వెంకట్, కొండలు, బాబావలి, హరి, ఖాశింసైదా, నాగరాజు, వెంకటేష్, రామకృష్ణ, తిరుమలరావు, అజయ్, వెంకటేశ్వరరావు, రామకృష్ణ, శేఖర్, పున్నారావు తదితరులు పాల్గొన్నారు.



తరగతి గదిని ప్రారంభిస్తున్న భావన సూర్యనారాయణ తదితరులు

వైకుంఠపురం పాఠశాలలో 9వ తరగతి ప్రారంభం

అమరావతి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని వైకుంఠపురంలో ప్రాథమికోన్నత పాఠశాలలో ఇప్పటివరకు 8 తరగతులు ఉండగా నూతనంగా 9వ తరగతికి విద్యాశాఖ అనుమతినిచ్చింది. నూతనంగా మంజూరైన తరగతిని పెదమద్దూరు పీఏసీఎస్ అధ్యక్షుడు భావన సూర్యనారాయణ ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, బోధనా సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట

● ఎమ్మెల్యే యరపతినేని



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం, ఆరోగ్యానికి పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. పార్టీ కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే అందించారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 36మంది లబ్దిదారులకు రూ.31.78 లక్షల విలువైన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు పాండురంగ శ్రీను, ఏఎంసి చైర్మన్ వీరస్వామి, మండల పార్టీ కన్వీనర్లు గండికోట వెంకటేశ్వర్లు, బడిగుంచల వెంకటేశ్వర్లు, బెల్లంకొండ భద్రి, జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, డాక్టర్ వున్నం నాగమల్లిఖార్జునరావు, సయ్యద్ అమీర్‌అలి, వడ్డవల్లి సర్వేశ్వరరావు, కామిశెట్టి రమేష్, హసన్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ విగ్రహావిష్కరణలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బ్రహ్మనందరెడ్డి

అభివృద్ధి, సంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యం

● ఎమ్మెల్యే బ్రహ్మనందరెడ్డి

విజయపురిసౌత్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం సీఎం చంద్రబాబుతోనే సాధ్యమని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. మాచర్ల మండలం కొప్పునూరులో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. పేద, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి ఎన్టీఆర్ అన్నారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో ఎన్నికల హామీని అమలు చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని కొనియాడారు. రాష్ట్రంలో సీఎంఆర్ఎఫ్ నిధులు రూ.400కోట్లు వస్తే ఒక్క మాచర్లకే రూ.117 కోట్లు కేటాయించారన్నారు. రూ.800కోట్లతో నియోజకవర్గంలో ప్రతి ఇంటికి తాగునీరు అందించేందుకు త్వరలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సాగర్ మేకలగొంది వద్ద శంకుస్థాపన చేస్తారన్నారు.కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నేరేటి వీరాస్వామి యాదవ్, మార్కెట్‌యార్డు చైర్మన్ రాజబోయిన మల్లీశ్వరి మధుసూదన యాదవ్, జల్లెల పెదఅంజి, ముడిగే వెంకన్న, నెమలితోక వీరాంజియాదవ్, జల్లెల ఏడుకొండలు, సుధాకర్‌రెడ్డి, యారం భాస్కర్‌రెడ్డి, మేకల రామాంజి, కడియాల శ్రీను, జల్లెల రంగయ్య, మేకల పెద యల్లయ్య, చంద్రయ్య, గుమ్మా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే ధ్యేయం..

మాచర్లటౌన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మహిళల సాధికారతే ధ్యేయంగా కూటమి ప్రభుత్వ పనిచేస్తోందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని కళ్యాణ మండపంలో పూజిత మహిళా సొసైటీ ద్వారా శిక్షణ పొందిన మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు, బ్యూటిషియన్ కిట్లు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షురాలు కోటేశ్వరి, కూటమి నేతలు పాల్గొన్నారు.

వెనుకబడిన వర్గాలకు పెద్దపీట ప్రభుత్వ లక్ష్యం



ప్రమాణ స్వీకార సభలో ఎమ్మెల్యే బ్రహ్మనందరెడ్డి

కారంపూడి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన వర్గాలకు పెద్దపీట వేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి దేవస్థాన నూతన పాలక వర్గం ప్రమాణ స్వీకారంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. శనివార ఆలయ కూడలిలో పాలకవర్గ నూతన కమిటి చైర్మన్‌గా బలిగొడుగుల లక్ష్మీనారాయణ యాదవ్, మరో పదిమంది కమిటి సభ్యులలో ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో టీడీపీ వాణిజ్య విభాగం జిల్లా కార్యదర్శి పంగులూరి పుల్లయ్య, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పంగులూరి పుల్లయ్య, టీడీపీ పట్టణ అధ్యక్షుడు బొమ్మిన శేషగిరి, మండల అధ్యక్షుడు గోళ్ల సురేష్ యాదవ్, కటికల బాలకృష్ణ, బొల్నేడి శ్రీనివాసరావు, మిరియాల వెంకటేశ్వర్లు, తండా మస్తాన్‌జాని, చప్పిడి రాము తదితరులు పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చిన ఘనత కూటమి ప్రభుత్వానిదే

బెల్లంకొండ, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): హామీలను నెరవేర్చిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని రాష్ట్ర టీడీపీ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్ పేర్కొన్నారు. శనివారం బెల్లంకొండ టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ హామీ మేరకు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ఏర్పాటు చేశారన్నారు. కూటమి ప్రభుత్వంలోనే అన్ని వర్గాల వారికి సంక్షేమం జరుగుతుందని తెలిపారు. సమావేశంలో పార్టీ నేతలు లక్ష్మీనారాయణ, అక్కల వెంకట రామిరెడ్డి, వెన్నా సీతారామిరెడ్డి, గుడిసె కొండయ్య, జ్యోతి సముద్రం, ఓర్సు ఆనంద్, రసూల్, సయ్యద్ జానీ, సయ్యద్ మజీద్, ఎన్ పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.



పర్యావరణ హితం.. ప్రతిరూపం

● 19 అడుగుల మట్టి గణనాథుని విగ్రహం

గుంటూరు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): గణాధిపతి.. సకల దేవతల సమాహారం. పర్యావరణ హితం. చవితి వేడుకలకు ఆదర్శం ఈ 19 అడుగుల మట్టి గణనాథుడు. విశేషంగా ఆకట్టుకుంటున్న లంబోధరుడి విగ్రహాన్ని చూడగానే ఎవరైనా ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసింది అనుకుంటారు. వేడుకలకు రూ.లక్షలు ఖర్చు చేస్తున్న ఉత్సవ కమిటీలు.. మనసు పెడితే ఇలాంటి ప్రకృతి ప్రతిమలను కొలుదీర్చవచ్చు. చూడటానికి రెండు కళ్లు సరిపోని.. ఈ మట్టి గణపతి విగ్రహాన్ని పర్యావరణ హితంగా హైదరాబాదులో తయారు చేయించామని వాసవి యూత్ అధ్యక్షుడు తూనుగుంట్ల నాగేశ్వరరావు తెలిపారు. ఏటుకూరు రోడ్డులోని కార్యాలయంలో ఈ నెల 27 నుంచి సెప్టెంబరు 6వ తేదీ వరకు నిర్వహించనున్న గణపతి మహోత్సవాల బ్రోచర్లను విడుదల చేశారు. శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ఎదుట గణపతి మహోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఆటంకాల మధ్య ఆడేదెలా?

● నిరుపయోగంగా తెనాలి ఇండోర్ స్టేడియం ● ప్రైవేట్ పరం.. క్రీడా విహీనం
● ఆదాయానికే పరిమితమైన శాప్ ● వర్షమొస్తే..మైదానం తటాకమే..



మోకాలి లోతు నీటితో నిండిన మైదానం

తెనాలి క్రైం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : తెనాలిలో కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మించిన ఇండోర్ స్టేడియం పాలకుల నిర్లక్ష్యంతో నిరుపయోగంగా మారుతోంది. 2013లో రూ.1.50 కోట్లతో నిర్మించిన స్టేడియాన్ని అప్పటి స్పీకర్, నేటి మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రారంభించారు. 2017లో మూడున్నర ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ స్టేడియం చుట్టూ ప్రహరీ నిర్మించడంతో పాటు వాకింగ్ ట్రాక్, గ్రౌండ్ మెరక వంటి పనులను ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ రూ.2 కోట్లతో పూర్తి చేయించారు. మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ వాకింగ్ ట్రాక్ లైటింగ్, బిల్డింగ్‌పై హాలు నిర్మాణం, క్రీడాకారుల కోసం 4 రూములు, మున్సిపాలిటీ సహకారంతో అవుట్ డోర్ వెయిట్ లిఫ్టింగ్ పరికరాలు అందించారు. ఈ స్టేడియం ఎందరో జాతీయ స్థాయి క్రీడాకారులను అందించడంతో పాటు పట్టణ ప్రజల ఆదరణ పొందింది. ప్రతిరోజు వివిధ క్రీడల్లో 150 మంది క్రీడాకారులతో పాటు 200 మందికి పైగా వాకర్స్ స్టేడియంను వినియోగించుకుంటున్నారు.

ప్రైవేట్ పరం.. శాపం

అయితే గత ప్రభుత్వం ఈ స్టేడియం ప్రైవేట్ పరం చేయడంతో దాని ఆలనా పాలనా కరువైంది. కోర్టుల నిర్మాణం అసంపూర్తిగా మిగిలిపోయింది. గ్రౌండ్ పూర్తి



ఇండోర్ స్టేడియం

స్థాయిలో మెరక వేయకపోవడంతో వర్షం వస్తే రోజుల తరబడి మోకాలి లోతు నీరు నిల్వ ఉండిపోతున్నాయి. ప్రస్తుతం హ్యాండ్‌బాల్, వెయిట్ లిఫ్టింగ్ కోచ్‌లు, ఒక నైట్ వాచ్‌మెన్ అందుబాటులో ఉన్నారు. రూ.10 లక్షల వ్యయంతో చేపట్టే బాస్కట్‌బాల్ కోర్టు అసంపూర్తిగా మిగిలింది. గతంలో ఇక్కడ వాలీబాల్ కోచ్ అందుబాటులో ఉండేవారు. అతను బదిలీ కావడంతో ఆ స్థానం ఖాళీగా ఉంది. స్పోర్ట్స్ అథారిటీస్ ఆఫ్ ఏపీ (శాప్) గతలో ఈ స్టేడియంను నెలకు లక్షల రూపాయల వంతున మూడు సంవత్సరాలకు లీజుకు ఇచ్చింది. లీజు ద్వారా శాప్ రూ.40 లక్షల మేర లాభపడింది. ప్రస్తుతం స్టేడియం నిర్వహణకు శాప్ పైసా కూడా విదిలించడం లేదు. దీనితో ఈ ఇండోర్ స్టేడియం అనాధగా మారింది. కనీసం క్రీడా పరికరాల కొనుగోలు, గ్రౌండ్ మరమ్మతులకు గతంలో శాప్ పొందిన రూ.40 లక్షలలో సగం సొమ్ము కేటాయించినా స్టేడియం మెరుగు పడుతుందని ఇక్కడి క్రీడాకారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



సౌకర్యంగా లేని వాకింగ్ ట్రాక్

చెరువును తలపిస్తున్న కోర్టుల భాగం

ఆటగాళ్లకు చేయూత..

ఆటగాళ్లకు చేయూత నివ్వాలని పట్టణానికి చెందిన పలువురు దాతలు గతంలో ఇక్కడ రాష్ట్ర స్థాయిలో ఉత్తమ క్రీడాకారులను ఎంపిక చేసి వారికి కావాల్సిన ఉచిత వసతి, భోజనం, ప్రత్యేక శిక్షణ ఇప్పించి జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా రాణించడానికి తర్ఫీదు సొంత ఖర్చులతో ఇప్పించారు. ఎందరో రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులకు తెనాలి పుట్టినిల్లు. ప్రోత్సాహం కరువు కావడంతో అలనాటి కీర్తి మసకబారుతోంది. అగ్గి పెట్టెలాంటి భవంతులు, ఇరుకు ఇరుకు గదుల్లో పాఠాలు చెబుతున్న అనేక ప్రైవేట్ పాఠశాలలో పిల్లలకు ఆటవిడుపు కరువైంది. వ్యాయామ విద్యకు దూరమవుతున్న బాల్యం రాను రాను మానసికంగా, శారీరకంగా దుర్భరమవుతుంది. వాటిని దృష్టిలో ఉంచుకుని అంకిత భావం కలిగిన పాలకులు నిద్రాణ స్థితికి చేరిన తెనాలి ఇండోర్ స్టేడియానికి పునరుజ్జీవం కల్పించి రాష్ట్ర, జాతీయ స్థాయిలో క్రీడాకారులు రాణించేలా కృషి చేయాలని ఈ ప్రాంత క్రీడాకారులు కోరుతున్నారు.

తిరుగు ప్రయాణానికి తిప్పలు



ఏపీఎస్ఆర్‌టీసీ వెబ్‌సైట్‌లో చెన్నైకి టిక్కెట్‌లన్ని బుకింగ్ అయిపోయినట్లుగా డిస్‌ప్లే



ఓ ప్రైవేటు ట్రావెల్స్ సంస్థ స్లీపర్‌క్లాస్ టిక్కెట్ రూ. 6 వేలకు పైగా చేసిన బుకింగ్ లేఅవుట్

● చెన్నై మార్గంలోని రైళ్ల మళ్లింపు
● 18, 19, 20 తేదీల్లో కాజీపేట, విజయవాడ మీదుగా డైవర్షన్
● సెలవులకు వచ్చి.. ప్రయాణికుల అవస్థలు

గుంటూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): నిత్యం చెన్నైకి గుంటూరు/న్యూగుంటూరు మీదగా ప్రయాణించే రైళ్లను చుండూరు వద్ద మూడో రైలు మార్గం పనుల కారణంగా రైల్వే శాఖ దారి మళ్లించడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నెల 18, 19, 20 తేదీల్లో గుంటూరు నుంచి చెన్నై సెంట్రల్‌కి టిక్కెట్ బుకింగ్ చేసుకోవడానికి ఎవరైనా ప్రయత్నిస్తే నో ట్రైన్ ఫౌండ్ అనే సందేశం ఐఆర్‌సీటీసీలో ప్రత్యక్షమవుతోంది. చెన్నై, జనశతాబ్ది, సర్కారు ఎక్స్‌ప్రెస్‌లు ఉన్నప్పటికీ ఇదేమిటని ఆశ్చర్యపోతున్నారు. తీరా వాకబు చేస్తే ఈ మూడు రైళ్లను కాజీపేట, విజయవాడ, తెనాలి మార్గంలో దారి మళ్లించారని తెలిసి మథనపడుతున్నారు. చెన్నైకి ఏపీఎస్ఆర్‌టీసీ కేవలం ఒకే ఒక్క సూపర్ లగ్జరీ బస్సుని నడుపుతోంది. ప్రైవేటు ట్రావెల్స్ 22 సర్వీసులు ఉన్నప్పటికీ టిక్కెట్ చార్జీ రూ. 2,500 నుంచి రూ. 3,500 వరకు ఉండటంతో బెంబేలెత్తిపోతున్నారు.

సెలవు దినాల్లో వచ్చి..

12604 చర్లపల్లి - చెన్నై సెంట్రల్ ఎక్స్‌ప్రెస్ నిత్యం నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి మీదగా ప్రయాణిస్తుంది. ఈ రైలు ఎంతో అనువుగా ఉంటుంది. రాత్రి వేళ బోర్డింగ్ చేస్తే మరుసటి రోజు వేకువజామునకు చెన్నై సెంట్రల్‌కు చేరుకొంటుంది. ఇందులో టిక్కెట్‌లు లభించకపోతే ప్రత్యామ్నాయంగా జనశతాబ్ధి, సర్కారు, కాత్రా, లక్నో రైళ్ల కోసం చూస్తారు. ఈ రైళ్లను గుంటూరుకు రాకుండా మూడు రోజుల పాటు దారి మళ్లించారు. దీంతో ఈ నెల 15, 16, 17 సెలవుదినాల కోసం గుంటూరుకు వచ్చిన వారంతా తిరుగు ప్రయాణం కావడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీసం విజయవాడ/తెనాలి వెళ్లి రైలు ఎక్కుదామన్నా ఆదివారం వరకు జనరల్ కోటాతో సహా తత్కాల్, ప్రీమియం తత్కాల కోటా టిక్కెట్‌లు బుకింగ్ అయిపోయాయి.

రెగ్యులర్, స్పెషల్ బస్సుల్లో టిక్కెట్లు సోల్డ్ అవుట్

చెన్నైకి ఆదివారం డిమాండ్‌ని దృష్టిలో పెట్టుకొని రెగ్యులర్‌తో పాటు గుంటూరు డిపో-1 నుంచి ఒకటి, డిపో-2 నుంచి రెండు స్పెషల్ బస్సులు ఏర్పాటు చేశారు. అవి ఇప్పటికే సోల్డ్ అవుట్ అయిపోయాయి. అలానే విజయవాడలో బయలుదేరి ఆటోనగర్ మీదగా వెళ్లిపోయే నాలుగు బస్సులు కూడా బుకింగ్ అయిపోయాయి. ప్రైవేటు ట్రావెల్స్‌లో స్లీపర్ బెర్తులు కొన్ని రూ. 6,199గా నిర్ణయించారు. కొన్ని బస్సుల్లో బెర్తులు ఖాళీలున్నా వాటి చార్జీలు చూస్తే కళ్లు తిరగాల్సిందే. ఈ నేపథ్యంలో ఆర్‌టీసీ మరికొన్ని స్పెషల్స్ ఏర్పాటు చేయాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

చూడండి ఒకసారి చంద్ర వంక



గుర్రపు డెక్కతో చంద్రవంక నది

● మాచర్లకు పొంచి ఉన్న వరద ముప్పు
● గుర్రపుడెక్క, ముళ్ల కంపతో నీటి ప్రవాహానికి ఆటంకం
● నీరు కనిపించనంతగా కప్పేసిన వైనం
● ఆక్రమణలతో కోల్పోయిన రూపురేఖలు

మాచర్లటౌన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మాచర్ల పట్టణం గుండా ప్రవహించే చంద్ర వంక ముళ్ల చెట్లతో, గుర్రపుడెక్కలో నిండిపోయింది. దీంతో వరద ప్రవాహానికి ఆటంకంగా మారింది. గత అనుభవాల దృష్ట్యా మాచర్ల పట్టణానికి వరద ముప్పు పొంచి ఉంది. ఏళ్ల తరబడి చంద్రవంక నది ఆధునికీకరణ నోచుకోకపోవడం వల్ల వర్షాకాలంలో వరద ప్రవాహం ముంచెత్తి పట్టణ ప్రజలపై విరుచుకుపడుతోంది. దీంతో తీవ్ర ఆస్తినష్టం జరిగిన ఘటనలు చాలా ఉన్నాయి. 1964లో వరద ప్రవాహానికి.. ప్రాణ, ఆస్తి నష్టం, మూగజీవాలు కోల్పోయిన ఘటన ఇప్పటికీ ఎవరూ మరిచిపోలేదు. ఆ తదుపరి 2016, 2018, 2023లో వరద ప్రవాహానికి పట్టణంలో ఆస్తినష్టం బాగా జరిగింది. ఎగువ ప్రాంతంలో భారీ వర్షాలు కురిసినప్పుడు వరద నీరంతా చంద్రవంక నదికి చేరి మాచర్ల పట్టణం గుండానే ఎత్తిపోతలకు చేరాల్సి ఉంది. ఈ తరుణంలో వరద ప్రవాహానికి ఎటువంటి ఆటంకం లేకుండా ఉంటే పట్టణానికి నష్టం జరగకుండా ఉంటుంది.



వరద ప్రవాహానికి అడ్డుగా ముళ్ల కంప, గుర్రపుడెక్క

రూపురేఖలు కోల్పోయిన చంద్రవంక

కాల క్రమంలో చంద్రవంక ఆక్రమణలకు గురై రూపురేఖలను కోల్పోయింది. నదికి ఇరువైపులా ఇటుకబట్టీలు, నివాసాలు, కల్వర్టులు, లోచప్టాలు, బ్రిడ్జిలు వంటివి ఏర్పాటు చేయడం వల్ల సహజత్వం కోల్పోయి వరద ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతోంది. దీనికితోడు ఇరువైపులా బండ్స్ సరిగా లేకపోవడం వల్ల వర్షాకాలంలో వరద వచ్చినప్పుడు పట్టణ ప్రజలు బిక్కుబిక్కుమనాల్సిన పరిస్థితి నెలకొంది. వెల్దుర్తి మండలంలో పట్లవీడు చెరువు, బ్రహ్మనాయుడు చెరువు, బోదలవీడు చెరువు, దుర్గి మండలం ఆత్మకూరు చెరువు నిండిన తరువాత అకస్మాత్తుగా గండి పడితే ఆ వరద నీరంతా చంద్రవంక ద్వారా మాచర్ల పట్టణం గుండా ఎత్తిపోతల ద్వారా కృష్ణానదికి చేరాల్సి ఉంటుంది. ఈ తరుణంలో వరద ఉధృతి పెరిగి పట్టణంపై విరుచుకుపడ్డ సంఘటనలు గత అనుభవాలు ఎన్నో ఉన్నాయి. చంద్రవంక నది పరివాహక ప్రాంతంలో ముళ్ల పొదలను, గుర్రపుడెక్కను తొలగించి బండ్స్‌ను పునరుద్ధరిస్తే వరద ముప్పు నుంచి బయటపడవచ్చు.

నాగార్జునకొండలో పర్యాటకుల సందడి



నాగార్జున కొండను సందర్శించి వస్తున్న పర్యాటకులు

● లాంచీ స్టేషన్ ఆదాయం రూ.1,78,450

విజయపురిసౌత్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయానికి భారీగా వరద ప్రవాహం వస్తుండడంతో సాగర్‌కు శనివారం పర్యాటకుల తాకిడి పెరిగింది. నాగార్జున కొండకు పర్యాటకులు భారీగా తరలివచ్చారు. కేరింతలు కొడుతూ లాంచీలలో నాగార్జున కొండకు వెళ్లారు. కొండలోని మ్యూజియంలో గల బుద్ధుని ప్రతిమలు, రాతి పనిముట్లు, మట్టికుండలు, 9 అడుగుల బుద్ధుని పాలరాతి విగ్రహం వీక్షించారు. అలాగే అనుపులోని యాంపీ థియేటర్, అశ్వమేధ యజ్ఞశాల, శ్రీరంగనాథస్వామి దేవాలయం, అనంతరం 60 అడుగుల ఎత్తునుంచి జాలువారే ఎత్తిపోతల జలపాతం అందాలను తిలకించారు. లాంచీల ద్వారా పర్యాటక శాఖకు రూ. 1,78,450 ఆదాయం సమకూరినట్లు లాంచీ యూనిట్ అధికారులు తెలిపారు.

బాలికా విద్యకు భరోసా

● అత్యాధునిక కంప్యూటర్ ల్యాబ్‌లు, గ్రంథాలయాలు
● కేజీబీవీల బలోపేతానికి ప్రభుత్వం చర్యలు

సత్తెనపల్లి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): బాలికల విద్య కోసం ఏర్పాటు చేసిన కేజీబీవీలను వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేసింది. జూనియర్ కళాశాల స్థాయికి.. అప్‌గ్రేడ్ చేసినా వసతులను మాత్రం పట్టించు కోలేదు. నాడు - నేడులో భాగంగా నిధులు కేటాయించిన బిల్లులు చెల్లించక పోవటంతో పనులు నిలిచి పోయాయి. తాజాగా వాటిని పూర్తి చేసే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంది. కేజీబీవీల్లో డార్మెంటరీతో పాటు అదనపు భవనాల నిర్మాణానికి నిధులు కేటాయిస్తోంది. జిల్లాలో ఉన్న 24 కేజీబీవీలు ఉన్నాయి. వాటిలోని సగానికిపైగా అదనపు భవనాలు, కంప్యూటర్ ల్యాబ్‌లు, గ్రంథాలయాల నిర్మాణాలు.. సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. మిగతా కేజీబీవీల్లో వచ్చే విద్యా సంవత్సరంలో అదనపు గదులతో పాటు డార్మిటరీలు ఏర్పాటు చేయనున్నారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయించి విద్యార్థినులకు వసతి సమస్య లేకుండా చేయడమే లక్ష్యంగా అధికారులు పనులు ప్రారంభించారు. జిల్లాలోని అన్ని కేజీబీవీలను కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేశారు. ఒక్కో తరగతిలో సగటున 40 సీట్ల వరకు ఉంటాయి. అన్ని కేజీబీవీల్లో అడ్మిషన్‌లు జరిగాయి. ప్రతి కేజీబీవీలో ఆరు డార్మిటరీ గదులు, రెండేసి మరుగు దొడ్ల బ్లాక్‌లు నిర్మించనున్నారు. ప్రధానంగా విద్యార్థినిలకు వసతి సమస్య లేకుండా చేయటమే ప్రభుత్వ లక్ష్యం. ఇతర మౌలిక సదుపాయలు కూడా కల్పించనుంది. ఎంపిక చేసిన కేజీబీవీల్లో రూ.18.5 లక్షల వ్యయంతో కంప్యూటర్ ల్యాబ్, రూ.23.10 లక్షలతో గ్రంథాలయం, రూ.18.05 లక్షలతో ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్ గది నిర్మించనున్నారు. చిన్న చిన్న మరమ్మతులు కూడా చేయించనున్నారు. దీని వల్ల బాలికల విద్యకు మరింత భరోసా లభించనుంది.



కేజీబీవీలో చదువుతున్న బాలికలు

అనారోగ్య కేంద్రం

● ప్రారంభం కాకముందే నీరు కారుతున్న భవనం
● గత ప్రభుత్వంలో గుత్తేదారు నిర్వాకం
● ప్రత్తిపాడు సీహెచ్‌సీలో చినుకుపడితే చిత్తడి

ప్రత్తిపాడు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రం.. అన్ని ఉన్నా అల్లుడి నోట్లో శని చందంలా తయారైంది. హాస్పిల్ భవన నిర్మాణం పూర్తయినా.. ప్రారంభానికి నోచుకోలేదు. కానీ, చినుకు పడితే నీరు కారుతూ వైద్యశాల చిత్తడిగా మారుతోంది. గత ప్రభుత్వంలో ప్రత్తిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణం జరిగింది. నిధులు విడుదల చేయక పోవడంతో సదరు కాంట్రాక్టర్ పనులను మధ్యలోనే ఆపేశాడు. కొద్ది పాటి వర్షానికే బిల్డింగ్ జాయింట్స్ నుంచి నీరు విపరీతంగా వైద్యశాలలోకి వస్తోంది. పైన సింగిల్ స్లేర్ ఉన్నప్పటికీ లోపల గదిలోనికి విపరీతంగా నీరు కారుతోంది. కొత్త బిల్డింగ్‌తోపాటు పాత బిల్డింగ్‌లోనూ నీరు కారుతుండటంతో కొంత వరకు బకెట్లు పెట్టి నీరు పడుతున్నారు. ఎక్సరే రూమ్‌తో పాటు మరి కొన్ని రూమ్‌లు నీటితో నిండి పోతున్నాయి. దీంతో అటు వైద్య సిబ్బందితో పాటు వచ్చే రోగులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. అంతే కాకుండా కొత్త బిల్డింగ్‌లో కొన్ని లోపలి గది గోడల నుంచి చెమ్మ దిగుతూ లేబరేటరీ గదిలోనికి వస్తున్నాయి. దీనిపై ఇప్పటికే వైద్య సిబ్బంది అనేక మార్లు ఫిర్యాదులు చేసినా ఉపయోగం లేకుండా పోయింది.



ఆరోగ్య కేంద్రంలో జాయింట్స్ వద్ద కారుతున్న నీరు



లేబరేటరీ రూమ్ గోడ నుండి వస్తున్న చెమ్మ



ఎక్సరే గదిలోపలికి చేరిన వర్షపు నీరు



జాయింట్స్ వద్ద నీరు కారుతున్న దృశ్యం

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

జాతీయ జెండాను అగౌరవపర్చేలా జగన్ తీరు: ప్రత్తిపాటి

చిలకలూరిపేట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని ఐదేళ్లు ముఖ్యమంత్రిగా పరిపాలించిన జగన్మోహన్‌రెడ్డి స్వాతంత్ర్య దినోత్సవం నాడు ఎక్కడా జెండా ఆవిష్కరణలో పాల్గొనకపోవడం జాతీయ జెండాను అగౌరవపరిచినట్లేనని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు శనివారం విమర్శించారు. స్వాతంత్ర్య దినోత్సవం నాడు జాతీయ జెండాకు వందనంచేయని వ్యక్తి అసలు భారతీయుడేనా అన్న సందేహం కలుగుతున్నదన్నారు. ఉపఎన్నికలలో తన నియోజకవర్గ ప్రజలు కొట్టిన చావుదెబ్బకు మతి భ్రమించి చివరకు జాతీయపతాకాన్ని అవమానించే దుస్థితికి దిగజారాడని అభిప్రాయం వ్యక్తం చేశారు. జగన్ మానసిక స్థితి క్షీణించిందని ఆయన ఆరోపించారు.

దాబాల్లో ఎక్సైజ్ అధికారుల దాడులు

వినుకొండ టౌన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని అనధికార రెస్టారెంట్లు, దాబాలపై ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. దాడుల్లో అనధికారికంగా దాబాల్లో మద్యం తాగుతున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు తెలిపా రు.

నలుగురు జూదరుల అరెస్టు

యడ్లపాడు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): యడ్లపాడు మండలం లింగారావుపాలెంలోని ఓ పేకాట స్థావరంపై ఎస్ఐ శివరామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు శనివారం దాడులు నిర్వహించారు. లింగారావుపాలెం నుంచి సొలస వెళ్లే మార్గంలోని ఓ నివాసంలో పేకాడుతున్నారన్న సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించిన పోలీసులు పేకాడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.19,200 స్వాధీనం చేసుకున్న పోలీసులు జూదరులను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌పై అవగాహన సదస్సు

నరసరావుపేట టౌన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌పై అవగాహన సదస్సు శనివారం జరిగిందని ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు తెలిపారు. ఎడ్యునయన్, ఎడ్యుటెక్ ఆధ్వర్యంలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌పై అవగాహన సదస్సు జరిగింది. బెంగుళూరు ఏఐ కార్పొరేట్ ట్రైనర్ జీ మేఘన పాల్గొని ఏఐ జనరేటివ్, ఉపయోగాలు, మెషిన్‌లెర్నింగ్ ఎలా చేస్తామో వివరించారు. ఏఐలోని పలు అంశాలపై అవగాహన కల్పించారు. సదస్సులో కళాశాల కంప్యూటర్ హెడ్ సురేఖ, ఎడ్యునయన్ డైరెక్టర్ హర్ష, ఫయాన్, ఈశ్వర్ పాల్గొన్నారు.

రూ.10 లక్షలతో మునిసిపల్ కమిషనర్ చాంబర్ ఏర్పాటు

నరసరావుపేట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): పాత భవనంలో ఉన్న మునిసిపల్ కమిషనర్ చాంబర్‌ను మార్చుతున్నారు. ఇంటీరియర్, ఫర్నిచర్, టీవీ కోసం రూ.10లక్షలు వెచ్చిస్తున్నారు. కొత్త భవనంలో కమిషనర్ చాంబర్ నిర్మాణం జరుగుతోంది. ఉన్న చాంబర్ అధికారులతో సమావేశాలను నిర్వహించేందుకు సరిపోవడంలేదని దీంతో కొత్త భవనంలో ఏర్పాటు చేస్తున్నామని డీఈ రఫీ తెలిపారు. కాగా చాంబర్ ఏర్పాటులో విద్యుత్ పనులు కాంట్రాక్టర్‌కు బదులుగా మునిసిపల్ విద్యుత్ విభాగం పనివారు నిర్వహిస్తుండటం గమనార్హం.

చిలకలూరిపేట తెలుగు యువత కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

చిలకలూరిపేట, ఆగస్టు16 (ఆంధ్రజ్యోతి): పట్టణ తెలుగు యువత నూతన కార్యవర్గం ఎన్నికలు శనివారం ఏకగ్రీవంగా జరిగాయి. కమిటీ అధ్యక్షుడిగా బొబ్బిళ్ళ ప్రసాద్ (నిమ్మకాయల ప్రసాద్), ప్రధాన కార్యదర్శిగా షేక్ కరిముల్లా (జీసీ కరిముల్లా) ఎన్నికయ్యారు. ఎన్నిక కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు నెల్లూరి సదాశివరావు, షేక్ కరిముల్లా, పఠాన్ సమద్ ఖాన్, మద్దుమాల రవి, జవ్వాజి మదన్‌మోహన్, బండారుపల్లి సత్యనారాయణ, కె.సాయిబాబు, మురకొండ మల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.

వీరవట్నంలో కంటి వైద్య శిబిరం

రొంపిచర్ల, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరవట్నంలో ఎల్‌వీ ప్రసాదు కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఈ శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు పల్లెల నాగిరెడ్డి, ప్రధాన కార్యదర్శి గాడిపర్తి సురేష్, చల్లా సుబ్బారావు, జాష్టి ప్రసాదు, సాగు నీటి సంఘం అధ్యక్షులు చిరుమామిళ్ళ మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ

వినుకొండ టౌన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): జన విజ్ఞాన వేదిక అధ్యక్షుడు, జాషువా సమాఖ్య గౌరవాధ్యక్షుడు, రచయిత జి.కమలారామ్ 'గొంట్లా వెంకమ్మ, రంగయ్య మెమోరియల్ ట్రస్ట్' తరఫున 8వ వార్డు స్కూల్లోని విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్, ఉపాధ్యాయులు కమలారామ్‌ని అభినందించారు.

పాఠశాల విద్యార్థులకు ప్రోత్సాహకాలు

నూజెండ్ల, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): సీతారామపురం శ్రీవెంకటేశ్వరస్వామి కమిటీ హైస్కూల్ 1991-96 పూర్వ విద్యార్థులు 2024-25 సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ధూపాటి శ్రావణి, అందుగులపాటి నందిని, దూదేకుల నసీనాలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సిన్హ కామేశ్వరరావు శర్మ, పూర్వ విద్యార్థులు ఆర్.శ్రీనివాసరావు, ఎ.శ్రీనివాసరెడ్డి, గురులింగయ్య, గిరిబాబు పాల్గొన్నారు.

నారు మడులు పరిశీలించిన డీఏవో

శావల్యాపురం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): శావల్యాపురంలోని వరి నారు మడులను జిల్లా వ్యవసాయాధికారి జగ్గారావు శనివారం పరిశీలించారు. కార్యక్రమంలో డీఏవో మాట్లాడుతూ ప్రస్తుతం పొగాకు పంట కొనుగోళ్లు కష్టతరంగా ఉన్నందున రైతులు ఎవ్వరూ పొగాకు పంటను సాగు చేయవద్దన్నారు. కార్యక్రమంలో ఏడీఏ రవికుమార్, ఇన్‌చార్జి ఎంఏవో రామారావు పాల్గొన్నారు.

వైభవంగా కృష్ణాష్టమి



నరసరావుపేటలోని ఇస్కాన్ మందిరంలో ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు



వినుకొండ శ్రీనివాస నగర్‌లోని ఆలయంలో స్వామివారు



చెంఘీజ్‌ఖాన్ పేటలోని వెన్నముద్ద బాలకృష్ణుడు



వెల్లటూరు రోడ్డులోని ఆలయంలో జరిగిన పూజల్లో పాల్గొన్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, డీసీసీబీ చైర్మన్ మక్కెన తదితరులు

యడ్లపాడు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ఆలయాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. చారిత్రక ప్రాశస్త్యం కలిగిన చెంఘీజ్‌ఖాన్‌పేట శ్రీరాజ్యలక్ష్మీ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు కన్నుల పండువగా నిర్వహించారు. వెన్నముద్ద బాలకృష్ణుని దర్శించుకునేందుకు తెల్లవారు జామునుంచే ఆలయానికి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులకు నవనీత బాలకృష్ణుని నిజరూప దర్శనం గావించారు. ఆలయ ప్రధాన అర్చకులు పరుచూరి సత్యన్నారాయణాచార్యుల ఆధ్వర్యంలో పూజారులు రాఘవేంద్ర, నితిన్‌లు స్వామివారికి సుప్రభాతసేవ, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. 20 రకాల దినుసులతో తయారుచేసిన మోడీకారంను భక్తులకు ప్రసాదంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దేవదాయశాఖ, గ్రామస్థుల సహకారంతో 3వేల మందికి అన్నదానం చేశారు. ఆలయ ఈవో నెమలిరెడ్డి, సహాయకుడు కృష్ణప్రసాద్‌లు కార్యక్రమాలను పర్యవేక్షించారు. కాగా మండలంలోని సొలస రంగనాయకస్వామి ఆలయం, లింగారావుపాలెం గీతామందిరం, జాలాది, యడ్లపాడు గ్రామాల్లోని కృష్ణ మందిరాల్లో కూడా కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కొండవీడులోని ఇస్కాన్ గోశాలలోని కృష్ణమందిరంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను వైభవంగా నిర్వహించారు.

● చెంఘీజ్‌ఖాన్‌పేట ఆలయంలో జరిగిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలలో టీడీపీ, జనసేన నాయకులు వేర్వేరుగా పాల్గొని పూజలు నిర్వహించారు. శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జనసేన నియోజకవర్గ నాయకులు మండలనేని చరణ్‌తేజ, సమన్వయకర్త తోట రాజారమేష్‌లు కృష్ణాష్టమి వేడుకలలో పాల్గొన్నారు.

● నరసరావుపేట టౌన్: పట్టణంలోని బరంపేటలో ఉన్న రాధా గోవింద చంద్ర మందిరం ఇస్కాన్‌లో శనివారం కృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శుభమంగళ హారతి, శుభదర్శన హారతి, శ్రీమద్‌భాగవత ప్రవచనం, మహా హరినామ సంకీర్తన జరిగాయి. ఉత్సవమూర్తులకు 56 రకాల ద్రవ్యాలతో మహాశంఖాభిషేకం, 108 రకాలతో మహారాజభోగ నివేదన జరిగింది. శ్రీకృష్ణ భగవానుని లీలా ప్రవచనం, ఏకాదశి ప్రసాద వితరణ జరిగింది.



గంగుపల్లిలో కృష్ణుని దేవాలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

● వినుకొండ: వెల్లటూరు రోడ్డులోని సంతాన వేణుగోపాలస్వామి దేవస్థానంలో చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● నరసరావుపేట టౌన్: నరసరావుపేటలోని కే-రిడ్జి ఇంటర్‌నేషనల్ స్కూల్‌లో శనివారం కృష్ణాష్టమి వేడుకల్లో చిన్నారులు బాలకృష్ణుడు, గోపికల వేషధారణ ప్రత్యేక అకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు, డైరెక్టర్ కోమటినేని నాసరయ్య, ప్రిన్సిపాల్ బర్నబాస్, క్యాంపస్ ఇన్‌చార్జి కోట బాపూజీ, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● బొల్లాపల్లి: మండలంలోని వెల్లటూరు, గంగుపల్లి, పలుకూరు, బొల్లాపల్లి, సంగినీడుపాలెం తదితర గ్రామాల్లో కృష్ణాష్టమి ఘనంగా నిర్వహించారు. గంగుపల్లిలో అన్నదానం, ఉట్టికొట్టే కార్యక్రమం జరిగింది.

● శావల్యాపురం: శ్రీకృష్ణ జన్మాష్టమిని మండలంలోని కారుమంచి, మతుకుమల్లి, బొందిలిపాలెం, చిన్నకంచెర్ల, శావల్యాపురం, పోట్లూరు, వేల్పూరు గ్రామాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు.

● చిలకలూరిపేట: ప్రపంచ మానవాళికి అత్యద్భుతమైన వ్యక్తిత్వ వికాస గ్రంథంగా భగవద్గీత ఎంతోదో హదపడుతుందని జీవీ ఐబీటీ పాఠశాల చైర్మన్ పారేపల్లి ఉదయ్ కుమార్ తెలిపారు. శ్రీకృష్ణాష్టమి పర్వదినం సందర్భంగా శనివారం స్థానిక జీవీ ఐబీటీ పాఠశాలలో జరిగిన శ్రీకృష్ణాష్టమి వేడుకలలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ శ్రీకృష్ణుడు కురుక్షేత్రంలో అర్జునుడికి తెలిపిన గీతాసారం అన్ని సమస్యల పరిష్కారానికి మూలాధారంగా ఉందన్నారు. పూజాకార్యక్రమాలలో పాఠశాల ప్రిన్సిపాల్ దేవులపల్లి ఫణికుమార్ పాల్గొన్నారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులకు వెన్న ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

● రొంపిచర్ల: మండలంలోని రొంపిచర్లలోని మదన గోపాల స్వామి, గోగులపాడులోని వేణుగోపాల స్వామి, దద్దనాల మిట్ట వద్ద ఉన్న ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొనకంచివారిపాలెంలో కృష్ణుడి విగ్రహం వద్ద మహిళలు పొంగళ్ళు నిర్వహించారు.

● వినుకొండ: పట్టణంలోని శ్రీనివాసనగర్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో కృష్ణాష్టమి సందర్భంగా అలివేలు మంగ పద్మావతి సమేత శ్రీవేంకటేశ్వర స్వామివారి సేవాసమితి ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు రెడ్డి బంగారయ్య, సెక్రటరీ అచ్యుత కృష్ణ సుబ్బారావు, ట్రెజరర్ కాళ్ల రామకోటేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. పల్నాడు రోడ్డులోని గీతమ్స్ బ్లూమ్స్ పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గీతమ్స్ విద్యాసంస్థల కరస్పాండెంట్ మాలపాటి కోటిరెడ్డి హాజరయ్యారు. పట్టణంలోని గీతాంజలి రెసిడెన్షియల్ క్యాంపస్‌లో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు వేడుకల్లో స్కూల్ ప్రిన్సిపాల్ కృష్ణవేణి, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.



చిలకలూరిపేటలో శ్రీకృష్ణాష్టమి సందర్భంగా అలరించిన చిన్నారుల వేషధారణలు

ఆదర్శనీయుడు సర్దార్ గౌతు లచ్చన్న

ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట టౌన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఆదర్శనీయుడు భారత స్వాతంత్ర్య సమార యోధుడు, సామాజిక సంస్కర్త, రైతు ఉద్యమ నాయకుడు సర్దార్ గౌతు లచ్చన్న అని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. శనివారం సర్దార్ గౌతు లచ్చన్న జయంతి ని రాష్ట్ర పండుగగా జరపాలనే ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నరసరావుపేటలోని కలెక్టర్ కార్యాలయంలో గౌతు లచ్చన్న 116వ జయంతి ఉత్సవం నిర్వహించారు. గౌతు లచ్చన్న చిత్రపటానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్దార్ గౌతు లచ్చన్న 21 ఏళ్ళ వయసులో గాంధీజీ పిలుపు మేరకు 1930లో ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని, స్వాతంత్ర్య ఉద్యమంలో అడుగు పెట్టారన్నారు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించి మొత్తం ఏడు సార్లు జైలు శిక్ష అనుభవించారన్నారు. గౌతు లచ్చన్న 1952 నుంచి 1983 వరకు సోంపేట నియోజకవర్గం నుంచి ఏడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నిక అయ్యారన్నారు. ప్రకాశం పంతులు, బెజవాడ గోపాలకృష్ణారెడ్డి మంత్రి వర్గాలలో విద్యుత్, కార్మికశాఖల మంత్రిగా సేవలందించారన్నారు. సర్దార్ గౌతు లచ్చన్న జీవితం సామాన్యుడు నుంచి అసాధారణ ఫలితాలు సాధించారని, ఆయన జీవితాన్ని విద్యార్థులు, యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. బీసీ సంఘాల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గౌడ సంఘం నాయకుడు యామా మురళి, రాష్ట్ర బీసీ సంఘం అధికార ప్రతినిధి బాదుగున్నల శ్రీనివాసరావు, గౌడ సంఘం నాయకులు దాసరి శ్రీను, కొండలు, సాంబశివరావు, వెంకటరావు, రమణ, విజయ్, శివ, లాలా, నరసింహారావు, నరసరావుపేట తహసీల్దార్ కే వేణుగోపాలరావు, సాంఘీక సంక్షేమ అధికారి కే సంతోష్, వసతి గృహ సంక్షేమాధికారులు టీ శ్రీనివాసరావు, కిరణ్, రత్నబాబు, మణికుమారి పాల్గొన్నారు.



గౌతు లచ్చన్న చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు, బీసీ సంఘాల నాయకులు

ఉత్తమ సేవలకు పలువురికి ప్రశంసాపత్రాలు

చిలకలూరిపేట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ సేవలను అందించిన పట్టణానికి చెందిన పలువురు అధికారులకు కలెక్టరేట్ ఆవరణలో జరిగిన స్వాతంత్ర్య వేడుకలలో ప్రశంసాపత్రాలను అందుకున్నారు. చిలకలూరిపేట తహసీల్దార్ షేక్ మహమ్మద్ హుస్సేన్, చిలకలూరిపేట రూరల్ సీఐ బి.సుబ్బనాయుడు, చిలకలూరిపేట మండల పరిషత్ అభివృద్ధి అధికారి కె.శ్రీనివాసరావు, చిలకలూరిపేట మున్సిపల్ రెవెన్యూ అధికారి పి.సుబ్బారావు, చిలకలూరిపేట మున్సిపల్ కార్యాలయం కంప్యూటర్ ఆపరేటర్ షేక్ నూర్, కొమరవల్లిపాడు దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బి.అశోక్‌కుమార్‌లకు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, కలెక్టర్ అరుణ్‌బాబు ప్రశంసాపత్రం అందజేశారు. సేవా సంస్థ అసిస్ట్ డైరెక్టర్ డాక్టర్ జాష్టి రంగారావుకు బాపట్ల కలెక్టర్ మురళి, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రశంసా పత్రం అందజేశారు.

ఐదుగురు అధికారులకు జిల్లా స్థాయి అవార్డులు

నూజెండ్ల, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండలం నుంచి ఐదుగురు ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు జిల్లా స్థాయి అవార్డులు అందుకున్నారు. అదేవిధంగా 13 మంది మండలస్థాయి పురస్కారాలు అధికారుల నుంచి అందుకున్నారు. తహసీల్దార్ జీ రమేష్‌కుమార్, వీఆర్‌వో ఆనంద్, పంచాయతీ సెక్రటరీ చిట్టి బాబు, ఏపీవో ఆంజనేయరాజు, ఎంపీడీవో కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ భారతిలు, జిల్లా స్థాయి ఉత్తమ ఉద్యోగులుగా మంత్రి నాదెండ్ల మనోహర్, కలెక్టర్ పీ అరుణ్‌బాబు నుంచి ప్రశంసాపత్రాలను అందుకున్నారు. మండలంలోని జంగాలపల్లి పంచాయతీ సెక్రటరీ ఎస్‌కే రబ్బానీ, గుర్రపునాయుడుపాలెం పంచాయతీ సెక్రటరీ ఎస్‌కే నాగూర్ లాలు, బీ దేవి, డిజిటల్ అసిస్టెంట్ రవ్వవరం సచివాలయం, వీ శివరామకృష్ణారెడ్డి, వేల్ఫేర్ అసిస్టెంట్ ముప్పరాజువారిపాలెం సచివాలయం, ఎన్ పద్మ, వీఆర్‌వో పుచ్చనూతల, ఈ బాలరామ్ వీ అప్పాపురం గ్రామ సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్, కే కుమారి, ఏఎన్‌ఎం ములకలూరు సచివాలయం, వీ గోపి, అగ్రికల్చర్ అసిస్టెంట్ ముక్కెళ్ళపాడు, పీ శివరామకోటేశ్వరరావు ఉప్పలపాడు గ్రామ సర్వే అసిస్టెంట్, ఎస్ జ్యోతిర్మయి మహిళా పోలీసు, ముక్కెళ్ళపాడు గ్రామ సచివాలయం, ఎన్.రాము, రవ్వవరం గ్రామ సచివాలయం వెటర్నరీ అసిస్టెంట్, వీ కొండయ్య, ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ కంప్యూటర్ ఆపరేటర్, ఎన్.వెంకటమోహన్, ఎంపీడీవో కార్యాలయం, కంప్యూటర్ ఆపరేటర్‌లు మండల స్థాయిలో ఉత్తమ అవార్డులు పొందారు.

పేట నియోజకవర్గ ఐటీడీపీ, మైనారిటీ విభాగం కమిటీల ఎన్నిక

చిలకలూరిపేట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ ఐటీడీపీ, మైనారిటీ విభాగం కమిటీల ఎన్నిక శనివారం నిర్వహించారు. రెండు కమిటీల ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ఐటీడీపీ అధ్యక్షుడిగా పిల్లి కోటి, ఉపాధ్యక్షుడిగా ఎన్.బాలాజీసింగ్, పి.భరత్, జి.కిరణ్, ప్రధాన కార్యదర్శిగా మహమ్మద్ రఫీలు ఎన్నికయ్యారు. మైనారిటీ విభాగం అధ్యక్షుడిగా బాజీ, ప్రధాన కార్యదర్శిగా రియాజ్‌లు ఎన్నికయ్యారు.

వాజ్‌పేయికి ఘన నివాళి



వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

వినుకొండ టౌన్ ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని, భారత రత్న అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా వినుకొండలోని భారతీయ జనతా పార్టీ (బీజేపీ) కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి కట్టా సుబ్బారావు తదితరులు వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తవ్వా నాగేశ్వరావు, జి.మస్తాన్‌రావు, బి.వెంకటేశ్వర్లు, మూర్తియ్య, శ్రీనివాసరావు, పి.శంకరరావు, గాలెమ్మ, రత్నాకర్‌తో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

● పోట్లూరు (శావల్యాపురం): బీజేపీ మండల అధ్యక్షుడు గట్టుపల్లి శ్రీనివాసరావు, బీజేపీ నేతలు వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పించారు. నాయకులు తమ్మిశెట్టి సిద్దయ్య, పోట్లూరు ఆంజనేయ ప్రసాద్ పాల్గొన్నారు.

చిలకలూరిపేటలో 19న విద్యుత్ వినియోగదారుల న్యాయ సదస్సు

చిలకలూరిపేట, ఆగస్టు16 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 19న ఉదయం 10.30గంటల నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పట్టణంలోని కృష్ణమహల్ రోడ్డులో ఉన్న సింగు మినీ ఫంక్షన్ హాల్‌లో విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్టు విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వై.ఏడుకొండలు శనివారం తెలిపారు. గుంటూరు టౌన్ 2 డివిజన్ పరిధిలోని డోకిపర్రు, ఫిరంగిపురం, ప్రత్తిపాడు, వట్టిచెరుకూరు, చిలకలూరిపేట టౌన్1, టౌన్ 2, రూరల్, గణపవరం, యడ్లపాడు సెక్షన్‌లకు సంబంధించిన విద్యుత్ సమస్యలకు తక్షణ పరిష్కారం కోసం చిలకలూరిపేట విద్యుత్ న్యాయ సదస్సు నిర్వహించనున్నట్టు వివరించారు. గుంటూరు టౌన్ 2 డివిజన్ పరిధిలోని 9 సెక్షన్ల పరిధిలోని విద్యుత్ వినియోగదారులు సదస్సులో పాల్గొని పరిష్కారం కాని తమ విద్యుత్ సమస్యలు తక్షణమే పరిష్కరించుకోవాలని ఆయన కోరారు.

యోగాభ్యాసంతో సంపూర్ణ ఆరోగం: వెంకటేశ్వర గురూజీ

నరసరావుపేట టౌన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): సంపూర్ణ ఆరోగ్యాన్ని, మనస్సు శాంతిని, ఆత్మనందాన్ని యోగాభ్యాసం కలుగజేస్తుందని శ్రీవెంకటేశ్వర యోగ సేవా కేంద్రం ప్రధాన గురువు ఏ వెంకటేశ్వర గురూజీ అన్నారు. శనివారం నరసరావుపేటలోని పట్టాభిరామస్వామి ఆలయ ప్రాంగణంలో వెంకటేశ్వర కల్యాణ మండపంలో 188వ ఉచిత యోగ శిక్షణ శిబిరం ముగింపు ఆనందమహోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఏ వెంకటేశ్వర గురూజీ మాట్లాడుతూ తపస్సు కన్నా, ధ్యానం కన్నా యోగ చాలా శ్రేష్టమైనదని భగవద్గీతలో శ్రీకృష్ణభగవానుడు చెప్పారన్నారు. నరసరావుపేట శాఖ నిర్వాహకులు కూనిశెట్టి వెంకట జనార్దనరావు 28 రోజుల పాటు ఉచిత శిక్షణకు హాజరైన యోగాభ్యాసకులకు జ్ఞాపికలు అందజేశారు.



సీఎం సహాయ నిధి చెక్కులను అందజేస్తున్న చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

పేదల వైద్యానికి సీఎం సహాయ నిధి అండ: జీవీ

వినుకొండ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న వారికి సీఎం సహాయ నిధి అండగా ఉంటోందని చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన 34మంది లబ్ధిదారులకు రూ.44,45,104 సీఎం సహాయ నిధి చెక్కులను శనివారం చీఫ్‌విప్ కార్యాలయంలో ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అందజేశారు. ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ వైద్య ఖర్చులు భరించలేని, ఆర్థిక ఇబ్బందులు పడుతున్న వారికి సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కూటమి ప్రభుత్వం పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సీఎం రిలీఫ్ ఫండ్ అందిస్తోందన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా తమ కుటుంబాలను ఆదుకున్నందుకు లబ్ధిదారులు జీవీకి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

26మందికి సీఎం ఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



సీఎం ఆర్ ఎఫ్ చెక్కుల పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన 26మందికి రూ.14,24,962ల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు శనివారం తన నివాస గృహంలో జరిగిన కార్యక్రమంలో అందించారు. వివిధ రకాల అనారోగ్య సమస్యలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారు, వారి కుటుంబ సభ్యులు ఈ చెక్కులను స్వీకరించారు. సీఎం ఆర్ఎఫ్ ద్వారా తమను ఆదుకున్నందుకు వారు ప్రత్తిపాటికి కృతజ్ఞతలు తెలిపారు.



కళాకారులను సత్కరిస్తున్న గుమ్మడి కళాపీఠం సభ్యులు

కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలి

● ఎన్టీఆర్ అభిమాన సంఘం ప్రధాన కార్యదర్శి బొప్పన

వినుకొండ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని అఖిలభారత ఎన్టీఆర్ అభిమాన సంఘం ప్రధాన కార్యదర్శి బొప్పన ప్రవీణ్‌కుమార్ కోరారు. గుమ్మడి కళాపీఠం ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి జరిగిన సభకు రవీంధ్ర స్కూల్ కరస్పాండెంట్ ఎస్ కే సుభాని అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ అంతరించిపోతున్న కళలను, ఆర్థిక ఇబ్బందుల్లో ఉంటున్న కళాకారులను గుమ్మడి కళాపీఠం ఆదుకుంటోందన్నారు. కళలను బతికించేందుకు కళాపీఠం కృషి చేస్తోందన్నారు. గుమ్మడి కళాపీఠం వ్యవస్థాపకుడు గుమ్మడి వెంకటేశ్వర్లు, మాట్లాడుతూ కళాకారులకు 'కళాకారుల కార్పొరేషన్' ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ముందుగా నాదస్వర కచేరి, వివిధ సినిమాల్లోని అభ్యుదయ పాటలతో సంగీత విభావరి నిర్వహించి కళాకారులను, భారత జవానును సత్కరించారు. కార్యక్రమంలో సమాచారహక్కు చట్టం జాతీయ ఉపాధ్యక్షుడు మట్టా ప్రసాద్, పాడుతా తీయగా ప్యాడ్ ప్లేయర్ అండ్ సింగర్ విజయరాజు, లావణ్య, ప్రముఖ న్యాయవాదులు ఎస్కే సిద్ధయ్య, ఆదిత్య, భావన, రామ్మోహన్‌రావు, నియోజకవర్గ కళాకారులు పాల్గొన్నారు.



రైలుపేటలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

రైలుపేటలో సీసీ రోడ్డు ప్రారంభం

వినుకొండ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా రైలుపేట వాసులకు ఇచ్చిన హామీమేరకు నూతనంగా నిర్మించిన సిమెంటు రోడ్డును ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు శనివారం ప్రారంభించారు. ప్రజల కోరిక మేరకు రోడ్డు నిర్మించారని, ఏడాది కాలంలో ఎన్‌డీఏ ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాలను అమలుచేసిన ఘనత చంద్రబాబునాయుడుకే దక్కిందన్నారు. ఈ నెల 19వ తేదీన మార్కెట్ యార్డులో కిసాన్‌మేళా నిర్వహిస్తారని, కార్యక్రమానికి గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు.